www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 8 | వెల రూ.5.00

Published from: Karimnagar, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar

హైదరాబాద్ | సంపుటి : 02 సంచిక : 218 | మంగళవారం | 21 జనవరి, 2025

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పాఠక మహాశయులకు విజ్ఞప్తి

తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!

వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

✆ : 99484 33277 / 7288825681



## దావోస్‌లో తెలుగు సీఎంల భేటీ

హైదరాబాద్, జనవరి 20 : స్విట్జర్లాండ్ లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు తెలుగు రాష్ట్రాల నుంచి ఇద్దరు సీఎంలు మంత్రులు హాజరయ్యారు. మంత్రులతో కలిసి దావోస్ పర్యటనకు వెళ్లిన సమయంలో అరుదైన కలయిక జరిగింది. జ్యూరిచ్ చేరుకున్న ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రులు, అధికారుల బృందం.. అదే ఎయిర్ పోర్టులో అప్పటికే అక్కడ ఉన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. తెలుగు రాష్ట్రాల ఇద్దరు సీఎంలు, మంత్రులు ఒకే చోట కలిసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. చిత్రలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేష్,

మిగతా 2 లో

# పెట్టుబడులే లక్ష్యంగా..

## దావోస్‌లో సీఎం రేవంత్ బృందం పర్యటన

- ఎయిర్‌పోర్టులో సీఎం బృందానికి స్వాగతం
- వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు హాజరు
- ఇప్పటికే రూ.40 వేల కోట్ల సమీకరణ

**హైదరాబాద్, జనవరి 20 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం దావోస్ చేసుకుంది. ఆయనవెంట ఐటి మంత్రి శ్రీధర్ బాబు, ఐటి సెక్రటరీ జయేశ్ రంజన్ ఇతర ప్రతినిధులు ఉన్నారు. సింగపూర్ పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకుని ఆదివారం రాత్రి దావోస్ పర్యటనకు బయలు దేరింది. దావోస్‌లో నాలుగు రోజుల పాటు జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో పాల్గొంటారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం వేదికగా తెలంగాణకు ఉన్న సానుకూలతలను చాటి చెప్పి పెట్టుబడులను తెచ్చే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి బృందం దావోస్ పర్యటనకు వెళ్లింది. పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా దావోస్‌లో రేవంత్ రెడ్డి పర్యటన కొనసాగుతుంది. ప్రపంచ అగ్రశ్రేణి పరిశ్రమలు, సంస్థల అధినేతలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీకానున్నారు. పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణను ప్రపంచానికి పరిచయం చేసేందుకు దావోస్ పర్యటనను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. గత ఏడాది దావోస్ పర్యటన సందర్భంగా రాష్ట్రానికి రూ. 40 వేల కోట్ల

మిగతా 2 లో




## మైలారంలో ఉద్రిక్తత

- మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి
- మైలారం గ్రామస్తుల ఆందోళన
- గ్రామంలోకి అధికారులు రాకుండా కంచె
- పోలీసులతో వాగ్వాదం.. పురుగు మందు డబ్బాలతో హెచ్చరిక
- పోలీసుల అదుపులో గ్రామస్తులు
- వెల్దండలో ప్రొఫెసర్ హరగోపాల్ అరెస్ట్

02



**నాగర్‌కర్నూల్, జనవరి 20:** నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం మైలారం గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్తులు పోలీసులను ఊరిలోకి రానీయకుండా అడ్డుకుంటున్నారు. ముళ్ల కంపలు వేసి మహిళలు, గ్రామస్తులు నిరసన తెలిపారు. పోలీసులకు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఓ మహిళ స్పృహతప్పి పడిపోయింది. మైలారం గ్రామస్తులకు, రైతులకు మద్దతు తెలిపినందుకు ప్రొఫెసర్ హరగోపాల్ పలు సంఘాల నాయకు లతో కలిసి వెళ్లగా పోలీసులు వారిని అక్రమంగా అరెస్ట్ చేశారు. కాగా, మాట తప్పి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీపై అన్ని వర్గాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నా ళ్లు ప్రభుత్వానికి, ప్రజలకు, ప్రతిపక్షాలకు వారధిలా ఉన్న హరగోపాల్ వంటి వ్యక్తులను అరెస్ట్ చేయడాన్ని యావత్ ప్రజానీకం ఖండించింది.



## ప్రియుడిని చంపిన ప్రియురాలికి ఉరిశిక్ష

- తిరువనంతపురం కోర్టు సంచలన తీర్పు
- ఆమె నేరాన్ని తక్కువగా చేయరాదని భావించిన కోర్టు

02



## సంజయ్ రాయ్‌కి జీవిత ఖైదు

- బాధితురాలి కుటుంబానికి 17 లక్షల పరిహారం
- ట్రెయినీ వైద్యురాలిపై హత్యాచారం కేసు కోల్‌కతాలోని సిల్దా కోర్టు సంచలన తీర్పు

02



## ఇందిరమ్మ ఇళ్ల కోసం మరో అవకాశం

- నేటి నుంచి గ్రామసభల్లో దరఖాస్తుల స్వీకరణ
- గతంలో దరఖాస్తు చేసుకోని వారికి మరో చాన్స్
- కొత్త రేషన్ కార్డులు, మార్పులు చేర్పులకు కూడా..

02

## మళ్లీ పడిపోతున్న ఉష్ణోగ్రతలు



02




## రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

- విద్యార్థులకు మంత్రి పొన్నం సూచన

03

## కవితమ్మ డాక్టర్‌కు చూపెట్టుకుంటే మంచిది

03

పసుపుబోర్డు వ్యాఖ్యలపై రఘునందన్ సెటైర్లు




## ఏడాదిలో ఏంచేశావ్ రేవంత్ రెడ్డి?

- ఒక కొత్త ఇటుక పెట్టినవా, ఒక కొత్త పైప్ లైన్ వేసినావా,
- మరోమారు అసహనం వ్యక్తం చేసిన కెటిఆర్



03




04

## రాహుల్‌గాంధీకి సుప్రీం ఊరట

- క్రిమినల్ కేసు విచారణను నిలిపివేసిన సుప్రీం కోర్టు

## తెలంగాణలో బీర్ల సరఫరా పునరుద్ధరణ

02




- ప్రకటన విడుదల చేసిన యూబి సంస్థ

## నేటి బీఆర్ఎస్ రైతు ధర్నా రద్దు

- పోలీసుల అనుమతి నిరాకరణతో కోర్టును ఆశ్రయించిన కేటీఆర్
- పోలీసుల నిర్ణయంలో జోక్యం చేసుకోలేమన్న హైకోర్టు

02



# ప్రజా నావ

ప్రతి అక్షరం జనం కోసం..

2 మంగళవారం 21 జనవరి 2025


# పెట్టుబడులే లక్ష్యంగా..



మొదటి పేజీ తరువాయి

పెట్టుబడులను ప్రభుత్వం సమీకరించింది. ఈసారి అంతకు మించి పెట్టుబడులను తేవడమే లక్ష్యంగా తమ పర్యటన కొనసాగుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల అధికారులతో సమీక్షలో వెల్లడించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులతో అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శిస్తాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు హైదరాబాద్ అడ్డాగా మారింది. ఐటీ, ఏఐ, ఫార్మా, తయారీ రంగాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతోపాటు ఇటీవల ప్రకటించిన పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి విధానం (క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ)పై ప్రముఖ కంపెనీలు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి. గత ఏడాది దావోస్ పర్యటనతోపాటు అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలతో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయి. కాగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మరో భారీ ఐటీ పార్కు ఏర్పాటు కానుంది. రూ.450 కోట్లతో కొత్త ఐటీ పార్కును ఏర్పాటు చేసేందుకు సింగపూర్‌కు చెందిన క్యాపిటల్ ల్యాండ్ కంపెనీ ముందుకు వచ్చింది. సుమారు 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక సౌకర్యాలతో ఈ ఐటీ పార్కును ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. దావోస్ వేదికగా మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు జరిగే 'ప్రపంచ ఆర్థిక ఫోరం' వార్షిక సదస్సులో ఈ బృందం పాల్గొననుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కంపెనీలు ఈ సదస్సుకు హాజరు కానున్న నేపథ్యంలో.. ఆ వేదికపై తెలంగాణలో కంపెనీల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను వివరించి, హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా పరిచయం చేయనున్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల కోసం మరో అవకాశం

**హైదరాబాద్, జనవరి 20:** కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు మరో అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది రాష్ట్ర ప్రభుత్వం. జనవరి 21 నుంచి జరిగే గ్రామ సభల్లో వీటి కోసం అప్లికేషన్లు స్వీకరించాలని కలెక్టర్లను ఆదేశించారు సీఎస్ శాంతి కుమారి. దీనికి సంబంధించి గైడ్స్ లైన్స్ తో సర్క్యులర్ పంపించారు. గ్రామ సభల్లో కొత్త రేషన్ కార్డులతో పాటు ఇప్పటికే ఉన్న కార్డుల్లో పేర్లు చేర్చడానికి దరఖాస్తులు స్వీకరించాలి. ఒకే కుటుంబం నుంచి వేరే పడ్తున్న కుటుంబాలకు కొత్త కార్డులు ఇచ్చేందుకు అప్లికేషన్లు తీసుకోవాలి. కుటుంబ పెద్దతో పాటు ఇతర కుటుంబ సభ్యుల వివరాలు, వారి ఆధార్ కార్డులు, కులం, మొబైల్ నంబర్, చిరునామా వంటి వివరాలను తీసుకోవాలని గైడ్ లైన్స్ లో స్పష్టం చేశారు.

# దావోస్‌లో తెలుగు సీఎంల భేటీ

మొదటి పేజీ తరువాయి

శ్రీధర్ బాబు, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహనాయుడు ఉన్నారు. మంత్రి శ్రీధర్ బాబు భుజంపై చేతులేసి.. షేక్ హ్యాండ్ ఇస్తున్నారు సీఎం చంద్రబాబు. ఉదయం జ్యూరిచ్ ఎయిర్ పోర్టులో వీళ్ల మీటింగ్ జరిగింది.తెలుగు రాష్ట్రాలకు పెట్టుబడులపై లక్ష్యంగా.. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, అధికారుల బృందం దావోస్ లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరైంది.

# మళ్లీ పడిపోతున్న ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్, జనవరి 20:** తెలంగాణ వ్యాప్తంగా చల్లని గాలులు వీస్తున్నాయి. పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యాయి. చలి విపరీతంగా ఉండడంతో ఆయా ప్రాంతాల ప్రజలు వణికిపోతున్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు ప్రాంతాల్లో పొగమంచు కూడా దట్టంగా కురుస్తోంది. దీంతో వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులుగా తర్వాత సోమవారం రోజుల ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యాయి. హైదరాబాద్ నగర శివార్లతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు నగర శివార్లలోని మొయినాబాద్‌లో 9.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, సంగారెడ్డి, నిర్మల్ జిల్లాల్లో పలు చోట్ల 6.5 డిగ్రీల నుంచి 9 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. రాబోయే మూడు రోజుల పాటు పలు ప్రాంతాల్లో ఈ ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. 5 నుంచి 10 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. ఈ మూడు రోజుల్లో పొద్దున్నే పొగమంచు దట్టంగా కురిసే అవకాశం ఉందని, వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు.

# సంజయ్ రాయ్‌కి జీవిత ఖైదు

**కోల్‌కతా, జనవరి 20:** కోల్‌కతా ఆర్జీకర్ మెడికల్ కాలేజీలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారం కేసుకు సంబంధించి దోషి సంజయ్ రాయ్ కి కోల్‌కతాలోని సీల్దా కోర్టు జీవిత ఖైదు శిక్ష వేస్తూ తీర్పు నిచ్చింది. ఈ కేసులో ఇప్పటికే విచారణను పూర్తి చేసిన కోల్‌కతాలోని సీల్దా కోర్టు.. గత శనివారం సంజయ్ రాయ్ దోషి అని తేల్చింది. ఈ కేసులో సోమవారం తీర్పును వెలువరిస్తామని చెప్పిన కోర్టు.. తాజాగా అతడికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పును ఇచ్చింది. ఇక సంజయ్ రాయ్ కి ఏం శిక్ష విధిస్తారని దేశం మొత్తం తీవ్ర ఉత్కంఠగా ఎదురుచూస్తుండగా.. అతడికి జీవిత ఖైదు విధించారు. కేసులో తీర్పు ఇవ్వడానికి ముందుగా సీల్దా కోర్టు జడ్జి జస్టిస్ అనిర్బన్ దాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు అరుదైనది అని తాను భావించడం లేదని.. అందుకే చనిపోయే వరకు జైలు శిక్ష అనుభవించాలని తీర్పును ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇదే సమయంలో ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన బాధితురాలి తల్లిదండ్రులకు రూ. 17 లక్షల పరిహారం చెల్లించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. 2023 ఆగస్టు 9వ తేదీ రాత్రి కోల్‌కతాలోని ఆర్జీకర్ హాస్పిటల్ సెమినార్ రూమ్‌లో నిద్రిస్తున్న జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, ఆపై హత్య జరగడం దేశంలో తీవ్ర సంచలనాన్ని రేపింది. మొదట కోల్‌కతా పోలీసులు ఈ కేసు విచారణ ప్రారంభించగా.. పశ్చిమ బెంగాల్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో సీబీఐ రంగంలోకి దిగింది. ఈ నేపథ్యంలోనే స్పెషల్ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసిన సీబీఐ.. ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ పేరును మాత్రమే అందులో చేర్చింది. అయితే ఈ ఘటనలో సామూహిక అత్యాచారం విషయాన్ని ఛార్జిషీట్‌లో పేర్కొనలేదు. ఆర్జీకర్ మెడికల్ ఆస్పత్రి ఆవరణలోని సీసీటీవీలో నమోదైన దృశ్యాల ఆధారంగా సంజయ్ రాయ్ ని గతేడాది ఆగస్ట్ 10వ తేదీన కోల్‌కతా పోలీసులు అరెస్ట్ చేశారు. ఇదే కేసులో అరెస్ట్ అయిన ఆర్జీకర్ మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్, తాలా పోలీస్ స్టేషన్ మాజీ ఆఫీసర్ ఇంఛార్జ్ అభిజిత్ మండల్‌లకు ఇప్పటికే బెయిల్ లభించింది. ఈ ఘటనలో సాక్ష్యాలు తారుమారు చేశారనే ఆరోపణలపై వారు అరెస్టు కాగా.. అరెస్ట్ తర్వాత 90 రోజుల్లో పోలీసులు, సీబీఐ ఛార్జిషీట్ ఫైల్ చేయకపోవడంతో వారికి బెయిల్ వచ్చింది. జంజ్రయ్‌రాయ్‌కు జీవిత ఖైదు శిక్ష విధించింది. అతడు మరణించే వరకు జైల్లోనే ఉంచాలని కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. అలాగే సంజయ్‌రాయ్‌కు రూ.50 వేల జరిమానా సైతం కోర్టు విధించింది. ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేసింది. అందులోభాగంగా మొత్తం120 మంది సాక్షులను సీబీఐ విచారించింది. దీంతో భారత న్యాయసంహిత చట్టంలోని సెక్షన్లు 64, 66,103/1 కింద సంజయ్‌కు జీవిత ఖైదు విధించింది. బాధితురాలి కుటుంబానికి న్యాయం జరగాలంటూ దేశవ్యాప్తంగా వైద్యులంతా ఆందోళనకు దిగారు. ఇక పశ్చిమ బెంగాల్ వైద్యులు అయితే.. తమ ఆందోళనలను మరింత ఉధృతం చేశారు. ఆ క్రమంలో వైద్య సేవలు సైతం నిలిచిపోయాయి. దీంతో వారితో చర్చలు జరిపేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. కానీ వైద్యులు.. తమ డిమాండ్లను మమతా బెనర్జీ ముందు ఉంచారు. కానీ వాటిలో కొన్నింటిని మాత్రమే ఆమె ఒప్పుకున్నారు. అనంతరం ప్రభుత్వం దిగి వచ్చి.. వైద్యులతో చర్చలు జరిపింది. అందుకు న్యాయం చేస్తామని.. అందుకు కొంత గడువు కోరింది. దీంతో వైద్యులు సానుకూలంగా స్పందించారు. కానీ ఇచ్చిన హామీలు ప్రభుత్వం నెరవేర్చక పోవడంతో.. వైద్యులు మళ్లీ ఆందోళన బాట పట్టారు. మరోవైపు అత్యవసర సేవలకు ఎటువంటి అటంకం కలిగించమని వైద్యులు ప్రభుత్వానికి హామీ ఇచ్చారు. ఇక ఈ హత్యాచార ఘటనపై ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి సూపరింటెండెంట్ సందీప్ ఘోష్ వెంటనే స్పందించారు. ఈ హత్యాచార ఘటనను ఆయన ఖండించారు. మృతురాలు తన కుమార్తెతో సమానమన్నారు. ఈ తరహా ఘటనలు భవిష్యత్తులో జరగకూడదని ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. ఆ కొద్ది రోజులకే ఆయన ఆసుపత్రి సూపరింటెండెంట్ పదవికి రాజీనామా చేశారు. అయితే ఆ వెంటనే ఆయన్ని మరో మెడికల్ కాలేజీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా నియమించింది. క ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఉన్న సమయంలో సందీప్ ఘోష్ పై పలు అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో కోర్టు జోక్యం చేసుకొని.. ఆయనను విధుల నుంచి తప్పించాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం విదితమే. ఇక ఇదే తనను బలి పశువును చేశారంటూ నిందితుడు సంజయ్ రాయ్.. కోర్టుకు విన్నవించుకొన్నాడు. అంతేకాదు.. విధులకు హాజరైన ట్రైయినీ వైద్యురాలు.. రాత్రి 11.00 గంటల సమయంలో సెమినార్ హాల్‌లో విశ్రాంతి తీసుకొనేందుకు వెళ్లింది. ఆ ఉదయానికి ఆమె హత్యాచారానికి గురై విగత జీవిగా మారింది. అయితే సెమినార్ హాల్‌లో సీసీ టీవీ కెమెరాలు లేకపోవడం గమనార్హం.

# మైలారంలో ఉద్రిక్తత



**నాగర్‌కర్నూల్, జనవరి 20:** నాగర్ కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం మైలారం గ్రామంలో జరుగుతున్న మైనింగ్ పనులపై గ్రామస్తులు తీవ్రస్థాయిలో ఆందోళనలు చేపడుతున్నారు. మైనింగ్‌ను నిలిపివేయాలని, మైనింగ్ వల్ల గ్రామానికి తమకు తీరని ముప్పు ఏర్పడుతుందని గ్రామస్తులు మైనింగ్ పనులను అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులు వారిని పోలీస్ స్టేషన్కు తరలించారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు ప్రధాన రహదారిపై ముళ్లకంచెలను ఏర్పాటు చేసి గ్రామంలోకి ఎవరిని రాకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులతో మహిళలు తీవ్రస్థాయిలో వాగ్దేవి వాదానికి దిగారు. అరెస్టు చేసిన గ్రామస్తులను వెంటనే వదిలిపెట్టాలని క్రిమిసంహారక మందుల డబ్బాలు చేతబడి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా పలువురు వారిని వారించారు. ఇదే క్రమంలో అక్రమ మైనింగ్ ను అరికట్టాలని గ్రామస్తులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా ప్రొఫెసర్ హరగోపాల్ మైలారం గ్రామానికి వస్తుండగా పోలీసులు వెల్దండ మండల కేంద్రంలో అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. ఇదిలా ఉండగా గత అసెంబ్లీ ఎన్నికల లో గ్రామస్తులు మధ్యాహ్నం వరకు ఓటింగ్ బహిష్కరించి తమ నిరసన వ్యక్తం చేసిన విషయం విధితమే. నాగర్ కర్నూల్ జిల్లా బాల్మూర్ మండలం మైలారం గ్రామంలోని సర్వే 121 లోని భూమిలో క్వర్జ్ తవ్వకాలకు కేటాయించిన మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు సోమవారం ఆందోళన నిర్వహించారు. గ్రామంలోని సర్వే నంబర్ 121 లో 120 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో గుట్టగా ఉన్న 35 ఎకరాలను క్వార్జ్ తవ్వకాల కోసం మైనింగ్ శాఖ కొందరికి అనుమతులు ఇచ్చింది. కొద్ది రోజుల నుంచి అక్కడ తవ్వకాల పక్రియ మొదలైంది. కాగా మైనింగ్ వలన ప్రకృతి సహజ సంపదతో పాటు.. తమ భూములు, ఇల్లు దెబ్బతినే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం నుంచి రిలే నిరాహారదీక్షలు చేప్పాటలని పిలుపునిచ్చారు. తమ నిరసనను పౌర హక్కుల నేతలు హరగోపాల్, గడ్డం లక్ష్మణ్ ను ఆహ్వానించారు. అలాగే గ్రామంలోకి అధికారులు, మైనింగ్ నిర్వాహకులు రాకుండా గ్రామంలోని రోడ్డుపై ముళ్ళ కంచే, రాళ్ళు అడ్డుగా పెట్టి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలియడంతో సిఐ రవీందర్, ఎస్ఐ రమాదేవి గ్రామానికి వెళ్లి ప్రజలకు నచ్చ జెప్పే ప్రయత్నం చేశారు. కానీ వినకపోవడంతో కొందర్ని బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. దీంతో కొంత మంది మహిళలు పురుగు మందు డబ్బాలు తీసుకొని ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో అందర్నీ పోలీసులు అక్కడి నుంచి వెళ్ళగొట్టారు. పౌర హక్కుల సంఘం నేతలను వెల్దండ వద్ద పోలీసులు అడ్డుకుని స్టేషన్ కు తరలించారు. మైలారం గ్రామస్తులు మాత్రం తమ ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## ప్రొఫెసర్ హరగోపాల్ అరెస్ట్

పౌర హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు ప్రొఫెసర్ హరగోపాల్, గడ్డం లక్ష్మ లక్ష్మణ్‌ను పోలీసులు నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలో పోలీసులు అరెస్ట్ చేశారు. అచ్చంపేట నియోజకవర్గం బల్మూరు మండలం మైలారం గ్రామంలో అక్రమ మైనింగ్, కాడ్జ్ తవ్వకాలను ఆపేయాలని ఆ గ్రామ ప్రజలు చేస్తున్న నిరసన కార్యక్రమాలకు మద్దతుగా వెళ్తున్న వారిని వెల్దండ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ప్రజలు చెప్పేది ప్రభుత్వాలు వినాలని ప్రజలకు మేలు చేయడానికి వెళుతుంటే అడ్డగించడం తగదని , ప్రజలకు మేలు చేయడానికి ప్రభుత్వాలు ఉన్నాయని అన్నారు.

# నేటి బీఆర్ఎస్ రైతు ధర్నా రద్దు

**హైదరాబాద్, జనవరి 20 :** నల్లగొండలో 21న తలపెట్టిన రైతు మహాధర్నా, కేటీఆర్ పర్యటన రద్దు అయ్యింది. కాంగ్రెస్ సర్కార్ రైతులకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నల్లగొండలో బీఆర్ఎస్ తలపెట్టిన రైతు మహాధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించారు. పోలీసుల నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. పోలీసుల అనుమతి విషయంలో ఇప్పుడే జోక్యం చేసుకోలేమని హైకోర్టు తెలిపింది. ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామ సభల నేపథ్యంలో బందోబస్తు ఇవ్వలేమని.. 26 తర్వాత రద్దీ ప్రాంతంలో కాకుండా అనువైన ప్రాంతంలో సభ నిర్వహించుకునేందుకు అభ్యంతరం లేదనే వాదనలు విన్న హైకోర్టు బీఆర్ఎస్ నేతల లంచ్ మోషన్ పిటీషన్‌ను 27కు వాయిదా వేసింది.

# తెలంగాణలో బీర్ల సరఫరా పునరుద్ధరణ

## ప్రకటన విడుదల చేసిన యూబి సంస్థ


**హైదరాబాద్,జనవరి 20 :** తెలంగాణలో అతిపెద్ద బీర్ల తయారీ సంస్థ యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ (యూబీఎల్) సంస్థ బీర్ల సరఫరాను పునరుద్ధరించింది. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వ హామీతో బీర్ల సరఫరాను పునరుద్ధరిస్తున్నట్లు పేర్కొంది. ధరల పెంపు, బకాయిలపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుందని తెలిపింది.గత రెండేళ్ల నుంచి రూ.702 కోట్ల బకాయిల్ని కార్పొరేషన్ విడుదల చేయకపోవడం, బీరు మూల ధరను సవరించాలని ఎన్నిసార్లు విన్నవించినా ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో బీర్ల సరఫరాను యూబీఎల్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో ఆరు బీర్ల తయారీ సంస్థలున్నా మార్కెట్లోకి వచ్చే వాటిలో 75 శాతం వాటా యూబీఎల్‌దే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడింది. దీంతో మద్యం ధరల పెంపు అంశంపై హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఆధ్వర్యంలో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ సిఫారసుల మేరకు నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో యూబీఎల్.. సరఫరాను పునరుద్ధరించింది.




# ప్రియుడిని చంపిన ప్రియురాలికి ఉరిశిక్ష

## తిరువనంతపురం స్థానిక కోర్టు సంచలన తీర్పు.. ఆమె నేరాన్ని తక్కువగా చేయరాదని భావించిన కోర్టు

తిరువనంతపురం, జనవరి 20 : కేరళ రాజధాని తిరువనంతపురం కోర్టు మరో కీలక తీర్పు వెల్లడించింది. ప్రియుడిని చంపిన కేసులో ప్రియురాలికి ఉరిశిక్ష విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. 2022లో కేరళలో విషం కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చి ప్రియుడు శరోన్ రాజ్‌ను ప్రియురాలు గ్రీష్మ చంపిన ఘటన సంచలన సృష్టించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. పూర్తి ఆధారాలు సేకరించి కోర్టుకు సమర్పించారు. ఆధారాలను పరిశీలించిన తిరవనంతపురం కోర్టు.. గ్రీష్మకు ఉరిశిక్ష విధిస్తూ కోర్టు వెలువరించింది. అంతేకాదు.. శరోన్ రాజ్ ను చంపేందుకు గ్రీష్మకు సహకరించిన బంధువుకు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. కేరళలో బాయ్‌ఫ్రెండ్‌ను 2022లో చంపిన గ్రీష్మ అనే యువతికి స్థానిక నెయ్యట్టింకర అదనపు జిల్లా సెషన్స్ కోర్టు మరణ శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ కేసులో మూడవ నిందితుడు, ఆమెకు సహకరించిన ఆమె మేనమామ నిర్మలకుమారన్ నాయర్‌కు కోర్టు మూడు సంవత్సరాల కారాగార శిక్ష విధించింది. విద్యాపరమైన తన విజయాలు, గత నేర చరిత్ర లేకపోవడం, తన తల్లిదండ్రులకు ఏకైక కుమార్తెను కావడం వంటి కారణాలను పేర్కొని తనకు శిక్ష విధించడంలో కనికరం చూపాలని 24 ఏళ్ల దోషి కోర్టును అభ్యర్థించింది. అయితే, ఆమె క్రూర నేరానికి పాల్పడి, సాక్ష్యాలను చెరిపివేసి, దర్యాప్తును తప్పుదోవ పట్టించిందని, ఆమె వయస్సును పరిగణనలోకి తీసుకోలేమని కోర్టు తన 586 పేజీల తీర్పులో స్పష్టం చేసినట్లు ప్రాసిక్యూటర్ వెల్లడించారు. తనతో రిలేషన్‌షిప్ ముగించేందుకు శరణ్ రాజ్ (23) ఒప్పుకోలేదని పెస్టిసైడ్ కలిపిన డ్రింక్ తాగించి అతనిని గ్రీష్మ చంపేసింది. ఆ ఘాతుకం జరిగిన సమయానికి ఆమె వయస్సు 22 సంవత్సరాలు. ఇక ప్రాసిక్యూషన్ నేరాన్ని రుజువు చేయడానికి సందర్భోచిత, డిజిటల్, శాస్త్రీయ అంశాలపై ఆధారపడిందని కోర్టు పేర్కొన్నది. దోషి దశలవారీగా ఈ నేరం సాగించడానికి కుట్ర పన్నిందని, ఆమెకు నేర నేపథ్యం ఉందని, గతంలో ఆ యువకుని హత్యకు ప్రయత్నించిన ఆమె దర్యాప్తును తప్పుదోవ పట్టించేందుకు అరెస్టు తరువాత తన ప్రాణం తీసుకునేందుకు ప్రయత్నించిందని కూడా కోర్టు పేర్కొన్నది. కాగా, ఇది అత్యంత అరుదైన కేసు అని, నిందితులకు ఉరిశిక్ష



విధించాలని వాదించినట్లు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీఎస్ వినీత్ కుమార్ మీడియాతో చెప్పారు. ఇది ఆదర్శప్రాయమైన ఒక తీర్పుగా ఆయన పేర్కొన్నారు. 2022లో గ్రీష్మ తన ప్రియుడు శరణ్ రాజ్‌కు పారాక్వాట్ అనే పెస్టిసైడ్ కలిపిన ఆయుర్వేద టానిక్‌తో విషం ఇచ్చింది. దానితో అతని శరీరంలోని పలు అవయవాలు విఫలం కావడంతో 11 రోజుల తరువాత అతను చనిపోయాడు. తమిళనాడుకు చెందిన ఆర్మీలో పని చేసే ఒక వ్యక్తితో తన పెళ్లి ఖాయం కావడంతో రాజ్‌తో తన అనుబంధాన్ని ముగించాలని ఆమె అనుకుంది. కానీ తమ సంబంధం ముగింపునకు అతను నిరాకరించడంతో హత్యకు గ్రీష్మ పథకం వేసింది. హతుడు శరణ్ రాజ్ తిరువనంతపురం జిల్లా పరశ్శల వాసి. హత్యతో సహ భారతీయ న్యాయ సంహితలోని వివిధ సెక్షన్ల కింద గ్రీష్మ దోషిగా తేలింది. ఆమె మేనమామ నిర్మలకుమారన్ నాయర్ సాక్ష్యాలను ధ్వంసం చేసిన కేసులో దోషిగా తేలాడు. అయితే, కస్టడీలోకి తీసుకున్న అతని తల్లి సాక్ష్యాధారాలు లేకపోవడంతో నిర్దోషిగా విడుదల అయింది. కేసు దర్యాప్తును పర్యవేక్షించిన అప్పటి ఎస్‌పి డి శిల్ప కోర్టు తీర్పును స్వాగతిస్తూ, పోలీస్ దర్యాప్తు బృందం సమష్టి కృషికి ఇది విజయం అని అన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
మంగళవారం
21 జనవరి 2025


# కక్షసాధింపు రాజకీయాలు సరికాదు

- కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, జనవరి 20 :** కక్ష సాధింపు రాజకీయాలకు తాను వ్యతిరేకం అని మాజీఎమ్మెల్యే జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాజకీయ పరిణామాలపై కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రివైంజ్ పాలిటిక్స్‌పై జగ్గారెడ్డి మీడియాతో చిట్‌చాట్ చేశారు. అయినా రివైంజ్ పాలిటిక్స్ ఏ పార్టీకి మంచిది కాదని సూచించారు. అలాంటి రాజకీయాలు చేసే వాళ్లు అధికారం పోయాక బాధ పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య.. రివైంజ్ పాలిటిక్స్ చేయలేదన్నారు. ఎవరైనా తనకు నష్టం చేసినా.. తానెవ్వరికీ నష్టం చేయను అని జగ్గారెడ్డి చెప్పుకొచ్చారు. కాకపోతే రాజకీయ యుద్ధం మాత్రం చేస్తామని పేర్కొన్నారు. ఏ రాజకీయ పార్టీ నాయకుడైనా? డబ్బులు తీసుకోకుండా రాజకీయం చేస్తున్నట్లుగా ఎవరైనా ఒప్పుకుంటారా..?, తనతో సహా పైసలు ముట్టుకోకుండా రాజకీయం చేయని నాయకుడెవరూ ఉండరని జగ్గారెడ్డి చెప్పుకొచ్చారు.

# సీఎం రేవంత్ మాటలు కోటలు..
# చేతలు గల్లీ కూడా దాటవు

- రాష్ట్రంలో కనీసం జీతాలు కూడా ఇవ్వలేని స్థితి : హరీశ్‌రావు



**హైదరాబాద్,జనవరి 20:** సీఎం రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటుతాయని కానీ చేతలు మాత్రం గల్లీ కూడా దాటదని, ప్రతి నెలా మొదటి తారీఖున ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామన్న సీఎం, మంత్రుల మాటలు నేతి బీరకాయలో నెయ్యిచందంగా మారాయని అనేకసార్లు రుజువయ్యాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకే కాదు.. మహిళల హక్కులను కాపాడే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మహిళా కమిషన్ సభ్యులకు గత సంవత్సర కాలం నుంచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం జీతాలు ఇవ్వడం లేదని తాజాగా నా దృష్టికి వచ్చింది అని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో మహిళా కమిషన్‌కు రూ. 2 కోట్ల 42 లక్షలు కేటాయించినప్పటికీ విడుదల చేసింది రూ. 20 లక్షలకు మించి లేదు. న్యాయమూర్తులతో సమానంగా వ్యవహరించబడే మహిళా కమిషన్ సభ్యులకే జీతాలు చెల్లించలేక పోతే ఈ ప్రభుత్వం సామాన్య మహిళల హక్కులను ఏ విధంగా కాపాడుతుంది..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. వెంటనే మహిళా కమిషన్ సభ్యుల పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని, ఇక నుంచి మొదటి తారీఖునే మహిళా కమిషన్ సభ్యులకు జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరుతున్నానని హరీశ్‌రావు తెలిపారు.



# కవితమ్మ డాక్టర్‌కు చూపెట్టుకుంటే మంచిది

## పసుపుబోర్డు వ్యాఖ్యలపై రఘునందన్ సెటైర్లు

**సంగారెడ్డి,జనవరి 20 :** పసుపు బోర్డు తమ వల్లే వచ్చిందన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సెటైర్లు వేశారు. కవిత మంచి డాక్టర్ కు చూపెట్టుకుని తర్వాత మాట్లాడాలని సూచించారు. జైల్లో ఉన్నప్పుడు కవిత ఆరోగ్యం బాగోలేదని వార్తలు వచ్చాయి... చెల్లె కవిత ఇప్పటికి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతుంది... మంచి డాక్టర్ కి చూపిస్తే ఆమె ఆరోగ్యం బాగుపడుతుంది. ఆ తర్వాత ప్రెస్ మీట్ పెడితే బాగుంటుందని రఘునందన్ రావు అన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్ కి రైతులు ఎందుకు గుర్తుకు రాలేదని రఘునందన్ రావు ప్రశ్నించారు. ఎర్రవల్లి ఫామ్ హౌస్ చుట్టూ ఉన్న గ్రామాల్లో రైతులు ఆత్మహత్య చేసుకున్నప్పుడు కేటీఆర్ ఎందుకు స్పందించలేదు. అధికారం పోయాక రైతులపై కేటీఆర్ కి ప్రేమ పెరిగి రైతు ధర్నాలు చేస్తున్నాడని విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ హయాం లోనే అంబేద్కర్ కి అవమానం జరిగింది. కాంగ్రెస్ ఐదున్నర దశాబ్దాలు అధికారంలో ఉండి ఏనాడూ అంబేద్కర్ ని గౌరవించలేదు.కేవలం అంబేద్కర్ జయంతి, వర్ధంతులు తప్ప కాంగ్రెస్ పార్టీ చేసింది ఏమి లేదు. 1950 లో నామినేటెడ్ ప్రధానిగా ఉన్నప్పుడే జవహర్ లాల్ నెహ్రూ రాజ్యాంగానికి తూట్లు పొడిచారు. రెండోసారి ప్రధానిగా ఇందిరాగాంధీ ఎమ్జర్గ÷న్సీ తీసుకువచ్చి రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారని రఘునందన్ రావు విమర్శించారు.

# అమెరికాలో కాల్పులు

## హైదరాబాద్ యువకుడు మృతి

**హైదరాబాద్, జనవరి 20 :** అమెరికాలో హైదరాబాద్ యువకుడిపై దుండగులు కాల్పులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో చైతన్యపురికి చెందిన రవితేజ మృతి చెందాడు. అతని మరణ వార్త విని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మాస్టర్స్ చదివేందుకు 2022లో రవితేజ అమెరికా వెళ్లినట్లు సమాచారం. దీనిపై ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.



# విద్యార్థి దశ నుంచి రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

## విద్యార్థులకు మంత్రి పొన్నం సూచన






**హైదరాబాద్, జనవరి 20 :** రోడ్డు ప్రమాదాల నివారణ విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలని విద్యార్థులకు కు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ నాచారంలోని డీపీఎస్ స్కూల్లో సోమవారం చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ ప్రారంభించారు. విద్యార్థులు రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్ నిబంధనలను తెలుసుకునేలాగా ట్రాఫిక్ అవేర్నెస్ చిల్డ్రన్ పార్క్ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి హాజరై మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రసంగించారు. విద్యార్థి దశలోనే ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించేందుకు ట్రాఫిక్ అవేర్నెస్ పార్కులు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. గతంలో రోడ్డు భద్రత అవగాహనపై వారోత్సవాలు ఉండేవని, ఇప్పుడు వాటి స్థానంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు తీసుకొచ్చామన్నారు. రవాణా శాఖలో కొత్తగా స్క్రాప్ పాలసీ, ఈవీ పాలసీ తీసుకొచ్చామని పేర్కొన్నారు. విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్ పాటించి.. మీ తల్లిదండ్రులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్రంలో పొల్యూషన్ కంట్రోల్ చేయడానికి స్క్రాప్ పాలసీ తెచ్చామని చెప్పారు. రోడ్ సేఫ్టీపై విద్యార్థి దశలోనే ట్రాఫిక్ అవగాహన కల్పించేందుకు పాఠ్య పుస్తకంలో ట్రాఫిక్ అవేర్నెస్?పై ఒక పాఠంగా చేర్చేందుకు ప్రణాళికలు చేస్తున్నామని పేర్కొన్నారు. స్కూల్?లో ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ ఏర్పాటుకు సహకరించిన డీపీస్ స్కూల్ యాజమాన్యానికి ఈ సందర్భంగా మంత్రి ధన్యవాదాలు తెలిపారు.



# ఏడాదిలో ఏంచేశావ్ రేవంత్ రెడ్డి?

## మరోమారు అసహనం వ్యక్తం చేసిన కెటిఆర్

**హైదరాబాద్,జనవరి 20:** ఈ ఏడాది కాలంలో రూ. లక్షా 40 వేల కోట్లు అప్పు చేసి ఏం పీకినవ్ రేవంత్ రెడ్డి..? అంటూ మరోమారు కెటిర్ తన అసహన భాషలో మాట్లాడారు. ఏడాదిలో ఏంచేశారని అడగడానికి ఆయన తన వల్గర్ లాంగ్వేజీలో ప్రశ్నించారు. ఒక కొత్త ఇటుక పెట్టినవా, ఒక కొత్త పైప్ లైన్ వేసినావా, ఒక కాలువ తవ్వినవా, ఒక కార్మికుడికి లాభం తెచ్చవా, ఒక ఆడబిడ్డకు రూ.2500 ఇచ్చావా, తులం బంగారం ఇచ్చవా..? ఏం పీకినవ్ సంవత్సరంలో అని రేవంత్ రెడ్డిని కేటీఆర్ నిలదీశారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ కార్మిక విభాగం క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చాలా హామీలు ఇచ్చింది.. హామీల అమలు కోసం నిలదీస్తే మీకు జీతాలు ఇచ్చుడే ఎక్కువ అని ఉద్యోగులను బెదిరిస్తున్నారు. కేసీఆర్ అప్పులపాలు చేసిపోయారు అని చెబుతుండ్రు. ఈ తప్పుడు ప్రచారాన్ని, పనికిమాలిన వెధవ ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత మనపైనే ఉంది. వాళ్లు మాట్లాడే మాటలు పచ్చి బక్వాస్ మాటలు, బోగస్ మాటలు. ఎలా అంటే.. 2014లో రాష్ట్రం ఏర్పడినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మనకు అప్పజెప్పారు. మన రాష్ట్రం మీద ఉన్న అప్పు ఆనాడు రూ. 72 వేల కోట్లు. తలసరి ఆదాయం రూ. లక్షా 14 వేలు. రూ. 369 కోట్లు రెవెన్యూ మిగులు ఉండే. మనం దిగిపోయినాడు.. తలసరి ఆదాయం రూ. 3 లక్షల 56 వేలకు తీసుకుపోయిండు కేసీఆర్. రెవెన్యూ మిగులు రూ. 5,944 కోట్లతో కాంగ్రెస్‌కు అప్పజెప్పాం. కేసీఆర్ సంపదను పెంచిండు. పాతబాకీలు కట్టుకుంటూ.. అన్ని సమస్యలను పరిష్కరించుకుంటూ.. చేసిన అప్పు మొత్తం 4 లక్షల 17 వేల కోట్లు. ఇది అప్పు కాదు పెట్టుబడి. అనేక ఇరిగేషన్ ప్రాజెక్టులను కట్టిండు.. కాళేశ్వరం, పాలమూర రంగారెడ్డి, సీతారామ, దామరచర్ల విద్యుత్ కేంద్రం, మెడికల్ కాలేజీలు, రైతు వేదికలు నిర్మించి సంపదను సృష్టించిండు. కేసీఆర్ మన భవిష్యత్ కోసం పెట్టుబడి పెట్టిండు అని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే హామీలన్నీ అమలు చేస్తామని భట్టి విక్రమార్కతో పాటు అందరూ మాట్లాడారు. కానీ చేసిందేమీ లేదు. రిటైర్ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తలేరు. డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. పీఆర్సీకి దిక్కు లేదు. ఎప్పుడైనా మనం ఆస్తులు, అప్పులు చూడాలి. ఒక్క ఏడాదిలో రేవంత్ రెడ్డి ఒక లక్షా 40 వేల కోట్ల అప్పు చేసిండు. కేసీఆరేమో ఏడాదికి రూ. 40 వేల కోట్లు అప్పు చేసి అభివృద్ధి కోసం ఖర్చు పెట్టిండు. కానీ రేవంత్ రెడ్డి చేసిన లక్షా 40 వేల కోట్ల అప్పుతో.. కొత్త ఇటుక పెట్టావా.. కాల్వ తవ్వినావా.. రైతుబంధు పెంచావా.. 2500 ఇచ్చావా.. తులం బంగారం ఇచ్చావా.. స్కూటీ ఇచ్చావా.. మరి ఏం పీకినవ్ వన్ ఇయర్‌లో.. మరి లక్షా 40 వేల కోట్లు ఎక్కడ పోయాయి రేవంత్ రెడ్డి..? కేసీఆర్ సాగునీరు తెచ్చిండు, మంచినీరు మంచిగా చేసిండు. రోడ్లు బాగు చేసిండు. సంక్షేమం చేసిండు. కార్మికులను కర్షకులను మంచిగా చూసుకుండు. ఒక్కటి మాత్రం రేవంత్ చేసిండు.. ఢిల్లీకి మూటలు మాత్రం జోరుగా మోసిండు.. వేల వేల కోట్లు పంపి కుర్చీని కాపాడుకుంటున్నాడు అని కేటీఆర్ ఆరోపించారు.

# సఫాయి అన్నకు సలాం కొట్టిన ఒకే ఒక్కడు కేసీఆర్

## కేసీఆర్ పాలనలో హ్యాపీగా కార్మికులు

## మూడుసార్లు జీతాలు పెంచిన దేవుడు కేసీఆర్: కేటీఆర్

**హైదరాబాద్,జనవరి 20 :** ఈ రాష్ట్రంలో పని చేసే కార్మికుల అభివృద్ధి కోసం నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ తెలిపారు. సఫాయి అన్న.. నీకు సలాం అన్న సీఎం ఈ దేశంలో ఎవరూ లేరు.. కేవలం కేసీఆర్ మాత్రమే అని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్ హమాలీలు, ఆటో డ్రైవర్ల కోసమే కాదు.. అందరి కోసం పని చేశారు. కార్మికుల ఇబ్బందులు, చికాకులు పరిష్కరించేందుకు కేసీఆర్ ఎంతో కృషి చేశారు. జీహెచ్ఎంసీలో సఫాయి కార్మికులకు మూడు సార్లు జీతాలు పెంచారు. తెలంగాణ ఏర్పడక ముందు నాటి ప్రభుత్వాలు అంగన్‌వాడీ టీచర్లను గుర్రాలతో తొక్కించారు. కానీ కేసీఆర్ ప్రభుత్వం వారిని పెద్ద మనసుతో ఆశీర్వదించింది. అంగన్‌వాడీల జీతం రూ. 4500 ఉంటే రూ. 13650కు పెంచారు. మినీ అంగన్‌వాడీలకు రూ. 2200 ఉంటే రూ.7800 చేశారు. ఇటీవల హైదరాబాద్ నగరంలో ఆశా వర్కర్ల పట్ల పోలీసుల అసభ్యంగా ప్రవర్తించారు. సీఎం రేవంత్ రెడ్డి మాదిరిగానే పోలీసులు కూడా ప్రవర్తించారు. ఆశావర్కర్లకు జీతాలు రూ. 2500 ఉంటే రూ. 9750 దాకా తీసుకువెళ్లాం. ఉపాధి హామీలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లకు కూడా జీతాలు పెంచినం. అన్ని రంగాల్లో పని చేసే కార్మికులను గుండెల్లో పెట్టుకున్నామని కేటీఆర్ తెలిపారు. హెూంగార్డుల విషయం బాధాకరం. మొన్న ఒక హెూంగార్డు కలిసి కళ్లల్లో నీళ్లు పెట్టుకున్నడు. రూ. 9 వేలు ఉండే జీతాన్ని రూ. 25 వేలు చేసిండు కేసీఆర్.. ఆయన దేవుడు. ఎందుకు ఓడగొట్టారు. ఆయన ఉంటే మాకు ఇంకా లాభం జరిగేది. పోలీసులతో సమానంగా పే స్కేలు వచ్చేది.. మూడు పూటల అన్నం తింటున్నాం అంటే కేసీఆర్ పుణ్యమే అని ఆ హెూంగార్డు చెప్పి బాధపడ్డాడని కేటీఆర్ గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కంటే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 73 శాతం వేతనాలు పెంచారు. దేశంలో అత్యధిక జీతాలు పొందుతున్న ఉద్యోగులు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులే. ఇది చిన్న విషయం కాదు. కాంట్రాక్టర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పీఆర్సీ వర్తింపజేశాం. అలాగే నాలుగున్నర లక్షల మంది బీడీ కార్మికులకు పెన్షన్లు ఇచ్చాం. 26 లక్షల మంది ప్రయివేటు డ్రైవర్లకు 5 లక్షల జీవిత బీమా ఇచ్చారు కేసీఆర్. వైద్య రంగం, మున్సిపల్ రంగంలో జీతాలు పెంచుకుంటూ పోయామని కేటీఆర్ తెలిపారు.

# బోధన చేస్తూ.. టీచర్ హఠాన్మరణం

## భద్రాద్రి జిల్లాలో విషాద ఘటన

**భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 20:** ప్రస్తుతకాలంలో రోజురోజుకీ గుండెపోటు మరణాలు ఎక్కువ అవుతున్నాయి. ఆ వయస్సు..ఈ వయస్సు అనే తేడా లేకుండా..చిన్న పిల్లలు నుంచి పెద్ద వయస్సు వరకు హార్ట్ స్ట్రోక్‌తో మరణిస్తున్నారు..ఇది ఆందోళన కలిగిస్తోంది..ఉరుకుల పరుగుల జీవితం, స్ట్రెస్ ఆహారపు అలవాట్లు ఇవ్వన్నీ గుండెపోటుకు కారణం అవుతున్నాయి..అప్పటి వరకు హుషారుగా పని చేస్తూ..అందరితో కలివిడిగా గడిపిన వారు ఒక్కసారిగా కుప్పకూలి మరణిస్తున్నారు.. తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో క్లాస్ రూమ్‌లో పాఠాలు బోధిస్తూ ఉపాధ్యాయుడు పిల్లి రమేష్(44) ఒక్కసారిగా కుప్పకూలి గుండెపోటుతో మరణించాడు ప్రభుత్వ ఉపాధ్యాయుడు. దీంతో విద్యార్థులు ,తోటి ఉపాధ్యాయులు.. ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. రమేష్ ప్రతి రోజూ ఖమ్మం నుంచి ఇల్లందు ప్రభుత్వ పాఠశాలకు వచ్చి విధులు నిర్వర్తిస్తున్నారు. సోమవారం ఉదయం ఉపాధ్యాయుడు రమేష్ ఎప్పటి లాగానే ఇల్లందుకు చేరుకోగానే చాతిలో కొంచెం నొప్పి అనిపించడంతో.. ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి గ్యాస్ సమస్యకు సంబంధించిన టా÷-లబెట్స్ తీసుకొని వేసుకున్నారు. కాస్త ఉపశమనం అనిపించగానే పాఠశాలకు వెళ్లాడు. పాఠశాలకు వెళ్లి క్లాస్ రూమ్‌లో విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు.తోటి ఉపాధ్యాయులు ఆయన్ను హుటాహుటిన ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి డాక్టర్లు సిపిఆర్ చేసి విశ్వప్రయత్నం చేసినప్పటికీ ప్రాణాలు నిలవలేదు. పరీక్షించిన వైద్యులు ఉపాధ్యాయుడు మృతి చెందాడని తెలపగానే తోటి ఉపాధ్యాయులు , విద్యార్థులు కన్నీటి పర్యంతం అయ్యారు. మృతి చెందిన ఉపాధ్యాయుడు స్కూల్ అసిస్టెంట్ హోదాలో ఫిజిక్స్ బోధిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.




# రాహుల్‌గాంధీకి ఊరట

- క్రిమినల్ కేసు విచారణను నిలిపివేసిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, జనవరి 20 :** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి భారీ ఊరట లభించింది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా, బీజేపీపై చేసిన వ్యాఖ్యలకు గానూ దాఖలైన పరువు నష్టం కేసులో ఆయనపై క్రిమినల్ విచారణను సుప్రీంకోర్టు నిలిపివేసింది. 2018 లో బెంగళూరులో జరిగిన విలేకరుల సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై రాహుల్ గాంధీ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. అమిత్ షా ఓ హత్య కేసులో నిందితుడని రాహుల్ ఆరోపించారు. ఆ ఘటనలో రాహుల్‌పై క్రిమినల్ డిఫమేషన్ కేసు బుక్ చేశారు. రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ కార్యకర్త నవీన్ ఝూ పరువునష్టం కేసు దాఖలు చేశారు. దీనిపై ట్రయల్ కోర్టు విచారణ జరిపింది. విచారణ సందర్భంగా వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలన్న రాహుల్ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. దీంతో రాహుల్.. జార?ండ్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి జార?ండ్ కోర్టు నిరాకరించింది. దీంతో రాహుల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. క్రిమినల్ పరువునష్టం కేసుకు సంబంధించి ట్రయల్ కోర్టులో తనపై విచారణను రద్దు చేయాలని క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన దేశ అత్యున్నత న్యాయస్థానం.. ట్రయల్ కోర్టులో ఈ కేసు విచారణపై స్టే విధించింది. ఈ మేరకు జార్ఖండ్ ప్రభుత్వానికి, బీజేపీ నేత నవీన్ ఝూకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా సమాధానాలు ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది.



# 200 నకిలీ నోట్ల చెలామణి

**రద్దు చేయాలన్న ఆలోచన లేదన్న ఆర్‌బిఐ**

**ముంబై, జనవరి 20 :** ప్రస్తుతం మార్కెట్‌లో 500 మరియు 200 రూపాయల నోట్లు ఎక్కువగా చెలామణిలో ఉన్నాయి. దీనికి సంబంధించి రిజర్వ్ బ్యాంక్ కీలక ప్రకటన చేసింది. ఆర్‌బీఐ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. మార్కెట్లో నకిలీ 200 రూపాయల నోట్లు వస్తున్నాయని, నకిలీ నోట్లను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నామని ఆర్బీఐ తెలిపింది. కొందరు 200 రూపాయల నోట్లను రద్దు చేస్తున్నట్లు పుకార్లు సృష్టిస్తున్నారని, అలాంటిదేమి లేదని స్పష్టం చేసింది. ఇలాంటి వార్తలను ప్రజలు నమ్మవద్దని సూచించింది. 2000 రూపాయల నోట్లపై నిషేధం తర్వాత దేశంలో నకిలీ 200, 500 రూపాయల నోట్ల చెలామణి నిరంతరం పెరుగుతోందని ఆర్‌బిఐ తెలిపింది. ఇలాంటి పరిస్థితిని క్యాష్ చేసుకోవడానికి కేటుగాళ్లు రంగంలోకి దిగి నోట్లను రద్దు చేస్తున్నట్లు పుకార్లు సృష్టిస్తున్నారని ఆర్బీఐ తెలిపింది. లావాదేవీల సమయంలో ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హెచ్చరించింది. ఇటీవల తెలంగాణలో 200 రూపాయల నోట్లకు కలర్ జిరాక్సులు తీయించి చలామణి చేస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# జగిత్యాల దవాఖానాలో అమానవీయ సంఘటన

## చావు బతుకుల్లో ఉన్న వ్యక్తిని పట్టించుకోని వైద్యులు



**జగిత్యాల,జనవరి 20:** జగిత్యాల జిల్లా ప్రభుత్వ దవాఖానాలో అమానవీయ సంఘటన చోటు చేసుకుంది. ప్రాణం పోయాల్సిన వైద్యులే పట్టనట్లుగా వ్యవహరించారు. బెడ్ పై నుంచి కిందపడి ఓ రోగి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నా.. ఎంతమందిని పిలిచినా ఎవరు స్పందించలేదు. గంటకు పైగా భూమయ్య బెడ్ కిందే పడిపోయి నరకయాతన అనుభవించాడు. నేను చచ్చిపోతున్న పట్టించుకోవాలని రోదించినా దవాఖాన సిబ్బందిలోని ఏ ఒక్కరి హృదయాన్ని కదిలించలేక పోయింది. ఆయన ఆర్తనాదం అరణ్య రోదనగానే మిగిలిపోయింది. కాగా, బీఆర్ఎస్ హయాంలో ఓ వెలుగు వెలిగిన ప్రభుత్వ దవాఖానులు నేడు పట్టించుకునే నాథుడే లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



# రాష్ట్రంలోనే కరీంనగర్ అభివృద్ధి

**కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్**

**ప్రజా నావ, కరీంనగర్:** సమైక్య పాలనలో జరగని అభివృద్ధి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతే కరీంనగర్ నగరం అభివృద్ధి చెందిందని కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ నగర అభివృద్ధి లో భాగంగా సోమవారం రోజు నగర మేయర్ యాదగిరి సునీల్ రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూప రాణీ హరిశంకర్, పలువురు కార్పొరేటర్లతో కలిసి 32వ డివిజన్లో పర్యటించారు. స్థానిక కార్పొరేటర్ మర్రి బావన సతీష్ తో కలిసి నగరపాలక సంస్థ కు చెందిన 45 లక్షల నిధులతో పలు చోట్ల సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం పనులకు భూమీ పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కరీంనగర్ శాసనసభ్యులు గంగుల మాట్లాడుతూ, కరీంనగర్ నగరం స్మార్ట్ సిటీ నిదులతో, మరియు సీఎం అస్యూరెన్స్ నిధులు ద్వారా కరీంనగర్ నగరం అభివృద్ధి చెందిందన్నారు. నగరపాలక సంస్థ మీద భారం పడకుండా.. తెలంగాణ గత ప్రభుత్వం ప్రతి సంవత్సరం 100 కోట్ల రూపాయలు చొప్పున నిధులు నగరపాలక సంస్థ కు మంజూరు చేసి సుమారు 350 కోట్ల రూపాయలను విడుదల చేసింది అన్నారు. వీటి ద్వారా నగరాన్ని అభివృద్ధి చేశామని తెలిపారు. గతంలో కేటాయించిన 85 కోట్ల సీఎం అస్యూరెన్స్ నిధుల పనులను ఇప్పటివరకు ప్రారంభించకపోవడం శోచనీయమన్నారు. మానేరు రివర్ ఫ్రంట్ ను పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగులతో పాటు, నగర మేయర్ సునీల్ రావు, నగర బిఆర్ఎస్ పార్టీ శాఖ అధ్యక్షులు చల్ల హరిశంకర్, స్థానిక డివిజన్ కార్పొరేటర్ మర్రి భావన -సతీష్, కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు డివిజన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# డివిజన్లలో మేయర్ పర్యటన



**ప్రజా నావ, కరీంనగర్:** మా పాలకవర్గం హయాంలో నగరం నలువైపుల అభివృద్ధి చెందిందని నగర మేయర్ సునీల్ రావు అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి లో భాగంగా సోమవారం రోజు మేయర్ యాదగిరి సునీల్ రావు 35,53 వ డివిజన్ లలో పర్యటించారు. సప్తగిరి కాలనీలో స్థానిక కార్పొరేటర్ బుచ్చిరెడ్డి తో కలిసి నగరపాలక సంస్థ కు చెందిన 35 లక్షల సాధరణ నిధులతో ఎస్ డబ్లుజీ డ్రైనేజీ పైపులైన్ పనులకు భూమీ పూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం డివిజన్ లో దాదాపు 40 లక్షలతో మహిళా సంఘం సభ్యుల కొసం అన్ని రకాల వసతులు కల్పిస్తూ, నూతనంగా నిర్మాణం చేసి మహిళా సంఘం భవనాన్ని కార్పొరేటర్ బుచ్చిరెడ్డి, మహిళా సమాఖ్య సంఘాల సభ్యులతో కలిసి భవనాన్ని ప్రారంభం చేశారు. మరో వైపు నగరంలోని 53 వ డివిజన్ కశ్మీగడ్డ లో స్థానిక కార్పొరేటర్ శ్రీదేవి చంద్రమౌళి తో కలిసి నగరపాలక సంస్థ కు చెందిన 5 లక్షల నిధులతో కలిసి ఎస్ డబ్లుజీ డ్రైనేజీ పైపులైన్, సీసీ రోడ్డు నిర్మాణం పనులకు భూమీ పూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ... 5 సంవత్సరాల పదవి కాలంలో నగర ప్రజలకు మెరుగైన సేవలందించామనే సంతృప్తి మా పాలకవర్గానికి కలిగిందన్నారు. ప్రజల ఆశీర్వాదం, మద్దతుతో రాబోయే రోజుల్లో దీవెనలు అందుకుంటామన్నారు. సుమారు 40 లక్షల రూపాయలతో మహిళా భవనాన్ని నిర్మించామని, ఈ భవనాన్ని కాపాడుకునే బాధ్యత మహిళలదే అన్నారు. నగర వ్యాప్తంగా చాలా డివిజన్ లలో మహిళా సమాఖ్య సంఘాల కోసం నగరపాలక సంస్థ నిధులతో భవనాలను నిర్మాణం చేశామని తెలిపారు. మహిళా సంఘ భవనాల్లో ఫర్నిచర్, ఫ్యాన్లు, బీరువాలో, మరుగుదొడ్ల సౌకర్యం కూడ కల్పించామని తెలిపారు. నగరం నలువైపులా అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు కావల్సిన సౌకర్యాలు కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు అయూభ్ ఖాన్, ఓం ప్రకాష్, గట్టు స్వామీ తదితరులు పాల్గొన్నారు.




# శబరిమల అయ్యప్పస్వామి ఆలయం మూసివేత

**శబరిమల,జనవరి20 :** కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలో మండలపూజ, మకర విళక్కు వార్షిక పూజలు వైభవంగా ముగిశాయి. దీంతో సోమవారం ఉదయం ఆలయాన్ని మూసివేసినట్లు ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డు అధికారులు వెల్లడించారు. పందలం రాజకుటుంబ ప్రతినిధి త్రికేత్తనాల్ రాజరాజ వర్మ అయ్యప్ప దర్శనం చేసుకున్న తర్వాత సోమవారం ఉదయం 6.30 గంటలకు ఆలయాన్ని మూసివేశామని పేర్కొన్నారు. ఈ సీజన్‌లో 53 లక్షల మందికిపైగా భక్తులు అయ్యప్ప స్వామివారిని దర్శించుకున్నారని తెలిపారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. రెండు నెలల పాటు జరిగే మండల-మకర విళక్కు వార్షిక పూజల కోసం నవంబర్ 15న అయ్యప్ప ఆలయాన్ని పూజారులు తెరిచారు. మండల పూజ అనంతరం డిసెంబర్ 26న గుడిని మూసివేశారు. 41 రోజులపాటు సాగిన పూజల్లో లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు. నాలుగు రోజుల విరామం తర్వాత డిసెంబర్ 30న సాయంత్రం 4 గంటలకు మళ్లీ ఆలయాన్ని తెరిచారు. ఈ సీజన్‌లో అయ్యప్ప ఆలయానికి భక్తులు పోటెత్తారు. రోజుకు లక్షలాది మంది భక్తులు అయ్యప్పను దర్శించుకున్నారు. మొత్తం 53 లక్షల మందికిపైగా భక్తులు అయ్యప్ప దర్శనం చేసుకున్నట్లు టీడీపీ తెలిపింది. సోమవారం ఉదయం 5 గంటలకు ఆలయాన్ని తెరిచి, తూర్పు మండపంలో గణపతి హెూమం చేశామని. ఆ తర్వాత మేల్శాంతి అరుణ్ కుమార్ నంబూద్రి అయ్యప్ప విగ్రహానికి విభూతాభిషేకం నిర్వహించి, దానిని రుద్రాక్షలతో అలంకరించారని వెల్లడించారు. 'హరివరాసనం' పారాయణం తర్వాత మేల్శాంతి ఆలయ దీపాలను ఆర్పి గర్భగుడిని అధికారికంగా మూసివేశామని చెప్పారు. అనంతరం ఆలయ తాళాలను రాజకుటుంబ సభ్యుడికి అప్పగించామని తెలిపారు.

# కేసులో ఇరికించారు

**ఆర్జీకర్ ఆస్పత్రి కేసులో దోషి సంజయ్ వాదన**



**కోల్‌కతా,జనవరి 20:** దేశవ్యాప్తంగా పెను సంచలనం రేపిన ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలిపై హత్యాచారం కేసులో దోషి సంజయ్ రాయ్ కోర్టులో తన వాదనను వినిపించాడు. శిక్ష ఖరారు చేయడానికి ముందు తన వాదనను వినిపించుకోవడానికి జడ్జి అతడికి అవకాశం కల్పించారు. తాను ఏ నేరం చేయలేదని ఈ సందర్భంగా సంజయ్ కోర్టుకు వెల్లడించాడు .'నేను ఈ నేరం చేయలేదు. ఏ కారణం లేకుండానే నన్ను ఇందులో ఇరికించారు. నన్ను దోషిగా నిలబెట్టారు. ఈ కేసుకు సంబంధించి పలు ఆధారాలు ధ్వంసమ య్యాయని నేను విన్నాను. నన్ను ఇరికించారో, లేదో దానిని బట్టి మీరే నిర్ణయించుకోండి. నాతో బలవంతంగా కాగితాలపై సంతకాలు చేయించారు. నేను అమాయకుడిని. నేను ఎప్పుడూ రుద్రాక్ష ధరిస్తాను. నేను నేరం చేసి ఉంటే.. అవి ఘటనాస్థలంలోనే ఊడిపోయి ఉండేవి. నాకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. మీరు ఇవన్నీ చూశారని అన్నాడు. కోల్‌కతాలోని ఆర్‌జికర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన కేసులో దోషిగా తేలిన సంజయ్ రాయ్‌ను కోర్టు దోషిగా తేల్చింది. అయితే, సోమవారం సీల్దా కోర్టు అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి అనిర్బన్ దాస్ మీరు ఏదైనా చెప్పాలనుకుంటున్నారా? అని ప్రశ్నించగా.. సంజయ్ రాయ్ మాట్లాడుతూ.. వారు నన్ను బలవంతంగా పత్రాలపై సంతకం చేయించారు.. నేను నిర్దోషిని అని పేర్కొన్నాడు.ఏ కారణం లేకుండా నన్ను ఈ కేసులో ఇరికించారు అని నిందితుడు సంజయ్ రాయ్ పేర్కొన్నాడు. నేను ఎప్పుడూ రుద్రాక్ష గొలుసు ధరిస్తానని ముందే చెప్పాను.. నేను నేరం చేసి ఉంటే, అది నేరం జరిగిన ప్రదేశంలో విరిగిపోయేది.. పోలీసులు, సీబీఐ అధికారులు నన్ను మాట్లాడనివ్వలేదు.. చాలా కాగితాలపై నన్ను బలవంతంగా సంతకం చేయించుకున్నారు.. అలాగే, వాళ్లు నాకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని కోర్టులో సంజయ్ రాయ్ చెప్పాడు. ఇక, సంజయ్ రాయ్ స్టేట్‌మెంట్‌లకు జడ్జి అనిర్బన్ దాస్ సమాధానమిస్తూ.. నాతో మాట్లాడేందుకు దాదాపు సగం రోజుల సమయం ఇచ్చాను.. మూడు గంటల పాటు నీ మాటలు విన్నాను.. నా ముందు సమర్పించిన అభియోగాలు, సాక్ష్యాలు, పత్రాలు, సాక్షులు అన్నీ పరిశీలించా.. వాటి ఆధారంగానే నిన్ను దోషిగా గుర్తించాను అని పేర్కొన్నారు. మీరు ఇప్పటికే దోషిగా నిరూపించబడ్డారని వెల్లడించారు.

# సైఫ్ కేసులో కోర్టులో ఇద్దరు లాయర్ల మధ్య గొడవ



**ముంబై, జనవరి 20 :** బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి చేసిన వ్యక్తిని ముంబై పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం మధ్యాహ్నం ముంబై మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు నిందితుడిని హాజరుపరిచారు. ఈ సందర్భంగా కోర్టులో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. నిందితుడు షెహజాద్ మహమ్మద్ తరఫున వాదించేందుకు ఇద్దరు లాయర్లు గొడవపడ్డారు. దీంతో న్యాయమూర్తి వారిద్దరి మధ్య సయోధ్య కుదిర్చారు. ఇంతకూ ఏం చేశారంటే.. సైఫ్ అలీఖాన్‌పై కత్తితో దాడిచేసిన కేసులో నిందితుడు షరీఫుల్ ఇస్లాం షెహజాద్ మహమ్మద్ రోహిల్లా అమీన్ ఫకీర్ (30)ను ఆదివారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. బంగ్లాదేశ్‌కు చెందిన అతడిని థాణేలో అటవీ ప్రాంతంలో ఉన్న ఒక లేబర్ క్యాంప్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి ముంబైకి తరలించారు. అనంతరం భారీ బందోబస్తు నడుమ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరపరిచారు. నిందితుల బోనులో నిలబడి ఉన్న షెహజాద్‌ను.. పోలీసులపై ఏమైనా ఫిర్యాదులు ఉన్నాయా అంటూ న్యాయమూర్తి ప్రశ్నించారు. దానికి అతడు వ్యతిరేకంగా సమాధానం ఇచ్చాడు. ఈ క్రమంలో షెహజాద్ వద్దకు వెళ్లిన ఓ లాయరు.. అతని తరఫున తాను వాదిస్తానంటూ వకాలత్ పత్రంపై సంతకం చేస్తున్నాడు. అంతలోనే మరో న్యాయవాది కూడా నిందితుని వద్దకు వెళ్లి తాను వకాల్తా పుచ్చుకుంటానంటూ సంబంధిత పత్రాలపై సంతకం కోసం ప్రయత్నించాడు. దీంతో ఇద్దరు లాయర్లు కోర్టు హాలులోనే వాదులాడుకున్నారు. దీంతో జోక్యం చేసుకున్న న్యాయమూర్తి.. ఇద్దరూ ఒక టీమ్‌గా అతని తరఫున వాదనలు వినిపించవచ్చని తెలిపారు. దానికి ఆ ఇద్దరు లాయర్లు కూడా సమ్మతించారు. కాగా, నిందితుడికి న్యాయస్థానంలో హాజరుపర్చగా ఐదు రోజుల పోలీస్ కస్టడీకి పంపిందని, ఈ దాడి వెనుక అంతర్జాతీయంగా ఏదన్నా కుట్ర ఉందా అన్న కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. బంగ్లాదేశ్ నుంచి ఐదు నెలల క్రితం భారత్‌కు అక్రమంగా వచ్చిన నిందితుడు తన పేరును విజయ్ దాస్‌గా మార్చుకున్నాడు. తర్వాత హౌస్ కీపింగ్ సహా చిన్నచిన్న పనులు చేసేవాడు. ఆ ఇల్లు నటుడు సైఫ్ అలీఖాన్‌దని తనకు తెలియదని, కేవలం చోరీ కోసమే అందులో ప్రవేశించినట్టు నిందితుడు తెలియజేసినట్టు పోలీస్ వర్గాలు వెల్లడించాయి.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
మంగళవారం
21 జనవరి 2025


# ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**ప్రజానావ, సిరిసిల్ల:** ప్రజల నుండి స్వీకరించే దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయా దరఖాస్తులు సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖకు 89 దరఖాస్తులు, ఎస్డీపీకి 6, బోయినపల్లి ఎంపీడీవో 1, ఎంప్లాయిమెంట్‌కు సంబంధించి 7, కోనరావుపేట ఎంపీడీవోకు 2, సిరిసిల్ల కమిషనర్‌కు 19, ఎల్లారెడ్డిపేట ఎంపీడీవోకు 2, హ్యాండ్ లూమ్స్ కు 1, తంగళ్లపల్లి ఎంపీడీవోకు 6, వేములవాడ ఎంపీడీవోకు 2, ఎడ్యుకేషన్‌కు 3, ఎస్పీ ఆఫీస్‌కు 12, ఎస్టీ కార్పొరేషన్ కు 5, డీఆర్డీఏకు 5, డీడబ్ల్యూఓకు 15, మెడికల్‌కు సంబంధించినవి 5, మైన్స్ 1, అగ్రికల్చర్ 7, సివిల్ సప్లై 3, ఎస్సీ డెవలప్మెంట్ 1, ముస్తాబాద్‌ఎంపీడీవోకు 1, సెస్స్ 1, చందుర్తి ఎంపీడీవోకు 1, సిరిసిల్ల సబ్ రిజిస్ట్రార్‌కు 1, వేములవాడ మున్సిపల్‌కమిషనర్‌కు 1, ఇంట్ర మిషన్‌భగీరథకు 1, ఫిషరీస్‌కు 1, ప్రొహిబిషన్ కు 1, కోఆపరేటివ్‌కు 1, ఇల్లంతకుంట ఎంపీడీవోకు 1 చొప్పున మొత్తం 202 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి చర్యలు

- 4.24 కోట్ల మీటర్ల ఆర్డర్లు అందచేత
- ఇందిరా మహిళా శక్తి చీరల ఆర్డర్స్ అందజేత
- టెస్కో జీఎం అశోక్ రావు



**ప్రజానావ, సిరిసిల్ల:** సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నదని టెస్కో జీఎం అశోక్ రావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు అందించే యూనిఫామ్ చీరల ఆర్డర్లు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా టెస్కో జీఎం అశోక్ రావు మాట్లాడారు. ఇందిరా మహిళా శక్తి చీరల పథకంలో భాగంగా ముందుగా ఒక చీరను ( అందరికీ ఒకే రంగు చీర) ఆర్డర్స్ దాదాపు 4.24 కోట్ల మీటర్లు అందజే సిందని వెల్లడించారు. ఈ చీరలను ఈ ఏప్రిల్ 30 వ తేదీలోగా సిద్ధం చేయాలని సూచించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ. 50 కోట్లతో యార్న్ బ్యాంక్ ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మార్కెట్ తో పోటీపడి స్వయం సమృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆర్డర్స్ తయారు చేసేలా యంత్రాలు ఆధునీకరించాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన రూ. 500 కోట్ల బకాయిలు విడుదల చేసిందని తెలిపారు. ఆధునిక, నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేసేలా సిద్ధం కావాలని పేర్కొన్నారు. ఇప్పటికే స్కూల్ యూనిఫాం మరమగ్గాల సంఘాలకు 65.67 లక్షల మీటర్లు ఆర్డర్స్ ఇచ్చామని వెల్లడించారు. ఆర్డర్స్ అందజేసిన సీఎం రేవంత్ రెడ్డి, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చేనేత జౌళి శాఖ సెక్రటరీకి ప్రత్యేక కృతజ్ఞతలు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ బాధ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హ్యాండ్ లూమ్ అండ్ టెక్స్టైల్స్ ఏడీ సాగర్, టెస్కో ఏడీ సందీప్ జోషి తదితరులు పాల్గొన్నారు.

# తాగి వాహనం నడుపొద్దు




## సీనియర్‌సివిల్‌జడ్జి

**ప్రజానావ, సిరిసిల్ల:** తాగి వాహనాలు నడుపొద్దని సీనియర్ సివిల్ జడ్జి రాధికా జైస్వాల్ సూచించారు. జాతీయ రోడ్డుభద్రత మాసోత్సవాల సందర్భంగా సోమవారం రాజన్న సిరిసిల్ల రవాణాశాఖ వారు నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇందులో భాగంగా వాహనాలకు రెడియం స్టిక్కర్స్ అంటించారు. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్, కారులో సీట్ బెల్ట్ ధరించి వాహనాలు నడిపిన వారికి స్వీట్స్, బహుమతి అందించారు. హెల్మెట్ సీట్ బెల్ట్ ధరించకుండా వాహనాలు నడిపిన వారికీ గులాబీ పువ్వు ఇచ్చి సున్నితంగా మందలించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడారు. ద్విచక్ర వాహనం నడుపువారు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పర్శరాములు, జిల్లా రవాణా శాఖా అధికారి వీ లక్ష్మణ్, మోటారు వాహన తనిఖీ అధికారి జి వంశీధర్, సహాయక మోటారు వాహనాల తనిఖీ అధికారి రజనీదేవి, పృథ్వీరాజ్ వర్మ, కానిస్టేబుల్ రమ్య, సౌమ్య, ప్రశాంత్, హోంగార్డ్ ఎల్లయ్య, సిబ్బంది కల్పనా, శ్రావణి, ట్రాక్టర్ ట్రైలర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పాటిరాజకుమార్, వాహన డ్రైవర్లు, ఓనర్లు సుమారు వందమంది పాల్గొన్నారు.



## జూబ్లీహిల్స్ కార్పొరేటర్ పర్యటన

ప్రజానావ, ఖైరతాబాద్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిల్మ్ నగర్ లోని భగత్ సింగ్ కాలనీ సోమవారం జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్లండ వెంకటేష్ పర్యటించారు. స్థానిక బస్తీ ప్రజలతో కలిసి పర్యటించి అక్కడి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను నూతన డ్రైనేజీ మరియు తాగునీటి పైపులైన్లు,తదితర పనులు చేయించామని తెలియజేశారు. డ్రైనేజీ పనులు పూర్తికావాడంతో, నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని, సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు ఏఈ వెంకటేష్ , స్థానిక నాయకులు సహాదేవ్, లింగాచారి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



"పోలీస్ అక్క" కార్యక్రమంలో భాగంగా వేములవాడలోని శ్రీ చైతన్య స్కూల్ లో సోమవారం పోలీసులు అవగాహన కల్పించారు. సామాజిక అంశాలను వివరించారు. ఇందులో మహిళా హెడ్ కానిస్టేబుల్‌బీ లత, పోలీస్‌సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.
- ప్రజానావ, వేములవాడ:



శివదిక్ష అన్నదాన సత్రానికి వాగ్దేవి కళాశాలల హన్మకొండ అధినేత దేవేందర్ రెడ్డి దంపతులు రూ.1,01,116 విరాళం అందించారు. వారికీ రాజన్న ఆశీస్సులు ఉండాలని సత్రం కోశాధికారి రాపెల్లి శ్రీధర్, గౌరవ అధ్యక్షులు మచ్చ కిషన్, కార్యదర్శి, రమణయ్య ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో శివ స్వాములు పాల్గొన్నారు.
- ప్రజానావ, వేములవాడ

# మత్తును తరిమికొట్టాలి



## ఇందులో విద్యార్థులు భాగస్వాములు కావాలి

## సిరిసిల్ల ఎస్పీ అఖిల్‌మహాజన్‌పిలుపు

**ప్రజానావ, సిరిసిల్ల:** గంజాయి, మతుపదార్థాలను తరమి కొట్టడంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని సిరిసిల్ల ఎస్పీ అఖిల్‌మహాజన్‌పిలుపునిచ్చారు. పరీక్షల సమయంలో ఒత్తిడిని అధిగమించడానికి మెడిటేషన్,యోగ వంటివి అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థినిలు మీ భద్రతకు సంబంధించిన సమస్యలపై నిర్భయంగా ఫిర్యాదు చేయాలని ధైర్యం చెప్పారు. సిరిసిల్ల పట్టణం పద్మనాయక ఫంక్షన్ హాల్లో విద్యార్థులకు పదవ తరగతి పరీక్షలపై ,గంజాయి లాంటి మత్తు పదార్థాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థులకు వాలీబాల్స్ అందజేసి, తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్ బ్యూరో అధికారులతో కలిసి 'సే నో టు డ్రగ్స్' పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి , నార్కొటక్ బ్యూరో డీఎస్పీ ఉపేందర్, సీఐ కృష్ణ, సిబ్బంది, పాటశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

# గణతంత్ర వేడుకకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

## అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



**ప్రజానావ, సిరిసిల్ల :** గణతంత్ర దినోత్సవ వేడుకకు విస్తృత ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. సోమవారం గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణ పై జిల్లా అధికారులతో తన ఛాంబర్ లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలోని పరేడ్ గ్రౌండ్ లో ఘనంగా నిర్వహించుటకు, గ్రౌండ్ ను, డయాస్ ను పోలిస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పూల అలంకరణతో సిద్దం చేయాలని అన్నారు. వేడుకల సందర్భంగా ప్రజా ప్రతినిధులకు, జిల్లా అధికారులకు, స్వాతంత్ర్య సమరయోధులకు, ప్రజలకు సీటింగ్ ఏర్పాట్లు ప్రోటోకాల్ ప్రకారం చేయాలని సిరిసిల్ల రెవెన్యూ డివిజనల్ అధికారిని, సిరిసిల్ల తహశిల్దార్ ను ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలు జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలతో కూడిన స్టాళ్ల ప్రదర్శనలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రసంశ పత్రాలను ప్రధానం చేయుటకు ఇంతవరకు ప్రశంస పత్రములు పొందని ఉత్తమ సేవలందించిన ఉద్యోగులను ఎంపిక చేసి జనవరి 24 లోగా ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల ఆర్డీవో వెంకటరెడ్డి, డీపీఆర్వో వీ శ్రీధర్, కమిషనర్ లావణ్య, డీఈవో జగన్మోహన్ రెడ్డి, సిరిసిల్ల తహసిల్దార్ ఉమారాణి, కలెక్టరేట్ ఏవో రామ్ రెడ్డి, ఏడీ హ్యాండ్లూమ్స్, టెక్స్టైల్‌సాగర్, ఏఆర్‌ఆర్‌ఐలు మధుకర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# పార్కు కబ్జా.. మేయర్ ఆగ్రహం



**ప్రజానావ, జూబ్లీహిల్స్:** జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 36లో జిహెచ్ఎంసి కి చెందిన పార్కు స్థలం అన్యాక్రాంతం పై మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మేయర్ అన్యాక్రాంతం అయిన పార్కు స్థలాన్ని డిసి ప్రశాంతి, ఇతర విభాగాల అధికారులతో కలిసి పరిశీలించారు. జూబ్లీహిల్స్‌హపోలీస్ స్టేషన్ వెనుక భాగంలో గల పార్కు స్థలంలో బయట ఉన్న జిహెచ్ఎంసి బోర్డు ను ఓ ప్రైవేట్ వ్యక్తి తొలగించి అట్టి బోర్డును ఎవరికీ కనిపించకుండా పెట్టి జిహెచ్ఎంసి పార్కు స్థలంలో పైప్ లైన్ వేసి కూరగాయలు పండించుకుంటున్నట్లు పరిశీలినలో మేయర్ దృష్టికి వచ్చింది. పార్కు పక్క ఫ్లాట్ వ్యక్తి తన సరిహద్దులో పెద్ద ప్రహరీగోడ నిర్మించుకోవడంతో నిచ్చెన వేసుకొని పార్కులోకి దిగి ఖాళీ స్థలంలో కూరగాయలు పండించుకుంటున్నట్లు తెలిసింది. ప్రైవేటు వ్యక్తి పార్కు స్థలాన్ని ఆక్రమించుకొని కూరగాయలు పండించుకుంటున్న నేపథ్యంలో వెంటనే టౌన్ ప్లానింగ్ అధికారులు సర్వే చేసి పార్కు స్థలంలో ఉన్న కాంపౌండ్ వాల్, పార్కులోని కూరగాయల మొక్కలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని, జీహెచ్ఎంసీ బోర్డును యథావిధిగా ఏర్పాటు చేయాలని మేయర్ అధికారులను ఆదేశించారు. అన్యాక్రాంతమైనహోసుమారు 15 వేల కోట్ల రూపాయల విలువ గల భూమిని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కాపాడారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... జిహెచ్ఎంసి పార్కు స్థలాన్ని గాని, ఖాళీ స్థలాలను కబ్జా/ఆక్రమించినా ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. క్రిమినల్ కేసులు పెట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మేయర్ వెంట డిసి ప్రశాంతి, ఈఈ విజయ్ కుమార్, సహాయ వైద్య ఆరోగ్య అధికారి భార్గవ్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు నిబంధనలు పాటించాలి

**ప్రజానావ, తిమ్మాపూర్:** ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని రీజినల్‌ట్రాన్స్ పోర్టు అథారిటీ మెంబర్ పడాల రాహుల్‌సూచించారు. సోమవారం కరీంనగర్ జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో తిమ్మాపూర్ లోని ఆర్టీవో కార్యాలయంలోని ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జనవరి మాసంలో దేశ వ్యాప్తంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో డీటీవో శ్రీకాంత్ చక్రవర్తి, ఎంవీఐ రవి కుమార్,ఏఎంవీఐ హరిత, ఆర్టీవో అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# క్రీడలతో దేహదారుఢ్యం

- బ్యాడ్మింటన్‌క్రీడాకారులు సైనా నేహ్వాల్, కశ్యప్, సీపీ సీవీ ఆనంద్





**హైదరాబాద్, జనవరి 20 :** క్రీడలు, ఆటలతో దేహదారుఢ్యం పెరగడంతో పాటు పని ఒత్తిళ్ల నుంచి అధిగమించి, ఆరోగ్యంగా ఉంటారని భారత బ్యాడ్మింటన్‌క్రీడాకారులు సైనా నెహ్వాల్, పీ కశ్యప్, హైదరాబాద్‌సీపీ ఆనంద్‌పేర్కొన్నారు. సోమవారం గోషామహల్‌పోలీస్‌స్టేడియంలో నిర్వహించిన హైదరాబాద్‌పోలీస్ కమిషనరేట్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2025ను సైనా నెహ్వాల్, కశ్యప్, సీవీ ఆనంద్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ క్రీడాకారులు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ లో గౌరవ వందనం స్వీకరించారు. క్రీడా జెండాను ఎగురవేయడంతో పాటు పావురాలను, బెలూన్లను ఎగురవేశారు. పోలీస్ క్రీడా జ్యోతి వెలిగించి, పోటీలను ప్రారంభించారు. ఈ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులతో పాటు, క్రీడల నిర్వహణాధికారులను పోలీస్ కమిషనర్ అభినందనలు తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గోనాల్సి ఉంటుందని, క్రీడల్లో గెలుపు ఓటములు ముఖ్యం కాదని, మీరు క్రీడల్లో ఎంత ప్రతిభ కనబరిచారో ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సీపీ లా ఆండ్ ఆర్డర్ విక్రమ్ సింగ్ మాన్, అడిషినల్ సీపీ ట్రాఫిక్ విశ్వప్రసాద్, డీసీపీ సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ రక్షిత కృష్ణ మూర్తి, క్రీడాకారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా బిజెపి పనిచేస్తది

### నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ



**ప్రజా నావ, కరీంనగర్:** భారతీయ జనతా పార్టీ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ ఆలోచన విధానాలు, ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తుందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. బిజెపి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రోజున కరీంనగర్ లోని సాయి మహాలక్ష్మి గార్డెన్లో సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమ సన్నాక సమావేశం జరిగింది. ఇట్టి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ పై కాంగ్రెస్ ది కపట ప్రేమ అన్నారు. గత 75 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ బాబా సాహెబ్ డా. భీమ్ రావు అంబేద్కర్ ను పలుమార్లు అగౌరవపరిచిందన్నారు. అంబేద్కర్ పై కాంగ్రెస్ కు ఉన్న వ్యతిరేక మనస్తత్వం కారణంగా భారతరత్న ఇవ్వలేదని, పాత పార్లమెంట్ హాల్లో కనీసం అంబేద్కర్ ఫోటోను పెట్టలేక పోయిందన్నారు. అంబేద్కర్ రాజ్యాంగానికి తూట్లు పొడిచిన చరిత్ర కాంగ్రెస్కే ఉందని, రాజ్యాంగాన్ని కాలరాసి దేశంలో ఎమర్జెన్సీ రోజులు తీసుకువచ్చిన చరిత్ర కాంగ్రెస్ దే అన్నారు. కాంగ్రెస్ విభజన ఎజెండాకు వ్యతిరేకంగా దేశాన్ని రక్షించడంలో అంబేద్కర్ కీలక పాత్ర పోషించారన్నారు. అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో సబ్ కా సాత్ సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్ , సబ్ కా ప్రయాస్ లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం చూపిన బాటతోనే 370 ఆర్టికల్ రద్దు జరిగిందన్నారు. బిజెపి రిజర్వేషన్ లను పొడిగించిందని, అట్రాసిటీ చట్టాన్ని మరింత బలోపేతం చేసిందన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ శాసనసభ్యురాలు బోడిగే శోభ, మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ రావు మాట్లాడారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీల పోస్టర్ ఆవిష్కరణ




**ప్రజానావ, సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్లలో జరగబోయే రాష్ట్ర స్థాయి కుంగ్ ఫు,కరాటే పోటీల పోస్టర్ ను హైదరాబాద్ లో వెంకటేశ్వర క్రియేషన్స్‌లో బలగం సినిమా డైరెక్టర్ వేణు ఎల్దండి, స్పార్క్ కుంగ్ ఫు అకాడమీ మాస్టర్ వోడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్పార్క్ కుంగ్ ఫు అకాడమీ మాస్టర్ వోడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. మొదటి రాష్ట్రస్థాయి కుంగ్‌ఫు, కరాటే పోటీలను రాజన్న సిరిసిల్లలో ఫిబ్రవరి 16న ఆదివారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సిరిసిల్ల జిల్లా కేంద్రం వెంకంపేటలోని సాయికృష్ణ ఫంక్షన్ హాల్‌నందు ఉదయం 9 గంటలకు ప్రారంభమౌతాయని తెలిపారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా ఎల్దండి వేణు హాజరు అవుతారని తెలిపారు. నిర్వహాకులుగా వోడ్నాల శ్రీనివాస్ వ్యవహరిస్తారని అన్నారు.రాష్ట్ర స్థాయి కుంగ్ ఫు, కరాటే పోటీలకు వివిధ జిల్లాల నుండి 1000 మంది విద్యార్థిని విద్యార్థులు 50 మంది మాస్టర్లు పాల్గొంటారని ఇట్టి పోటీలను విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా మాస్టర్ లను కోరారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మాస్టర్ వోడ్నాల శ్రీనివాస్, మాస్టర్ అన్నపూర్ణ, మాస్టర్ ప్రవళిక, మాస్టర్ ని వేదిత మాస్టర్ ఎలగందుల శ్రీనివాస్, మాస్టర్ చంద్రశేఖర్, మాస్టర్ వేణు లు పాల్గొన్నారు.

## కాలువలు ఇలా.. నీళ్లు పారేదెలా

### కాలువల్లో ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లు,గడ్డి

### పంటలు ఎండిపోకుండా కాపాడండి

### ఎమ్మెల్యే కవ్వంపల్లికి ముత్యాల జగన్ రెడ్డి విన్నపం



**గన్నేరువరం:** పంటపొలాలకు సాగునీరందించే కాలువల్లో చెట్లు, గడ్డిమొక్కలు పెరగడంతో నీళ్లు వచ్చే పరిస్థితి లేదని వెంటనే చెట్లను, పూడుకుపోయిన మట్టిని తొలగించి నీళ్లు పారే ఏర్పట్లు చేయాని మానకొండూర్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి కోరారు. కూనవానిపల్లి మీదుగా మైలారం గ్రామానికి సాగునీటిని తరలించే 3ఆర్–డీ8 కాలువ నిరుపయోగంగా మారిందన్నారు. సాగునీరు వస్తుందన్న నమ్మకతో రైతులు పంటలు వేసారని, తీరా నీళ్లు రాకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థతి వచ్చిందని పేర్కొన్నారు. కాలువల్లో మట్టి పూడుకుపోయి, చెట్లు, గడ్డి ఏపుగా పెరిగి నీటి ప్రవాహానానికి అడ్డుగా ఉన్నాయని వెంటనే ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చొరవతీసుకుని సంబంధిత అధికారులు కాలువ పూడికతీత పనులను వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కాలువల్లో నీరు రాకుంటే పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడే అవకాశం ఉందని జగన్ రెడ్డి అన్నారు.

## పద్మానగర్ మార్కెట్‌కు లక్కీడ్రా



**ప్రజా నావ, కరీంనగర్:** అన్ని రకాల సౌకర్యాలతో మాడ్రన్ గా తీర్చిదిద్దిన పద్మానగర్ సమీకృత మార్కెట్ ను 23 వ తేదీన ప్రారంభం చేసి...వ్యాపారులకు స్టాల్స్ అప్పగిస్తామని నగరపాలక సంస్థ కమీషనర్ చాహేత్ బాజ్ పాయ్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కళాభారతి ఆడిటోరియం లో పద్మానగర్ సమీకృత మార్కెట్ స్టాల్స్ కు లక్కి డ్రా ప్రశాంతంగా ముగిసింది. శాఖహారం, మాంసాహారం, పూలు, పండ్లు కలుపుకొని మొత్తం 193 స్టాల్స్ కు కమీషనర్ చాహేత్ బాజ్ పాయ్ అధ్యక్షతన రిజర్వేషన్ కెటగిరి ప్రకారం లక్కి డ్రా నిర్వహించడం జరిగింది. ఈ లక్కి డ్రా లో నగరపాలక సంస్థ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్టాల్స్ కోసం దరఖాస్తు చేసుకున్న వారిని మేయర్ యాదగిరి సునీల్ రావు తన చేతుల మీదుగా డ్రా తీసి స్టాల్స్ నెంబర్లను కేటాయించారు. లక్కి డ్రాలో 114 కూరగాయలు, 12 పండ్లు, 12 పూలు, 26 మాంసం స్టాల్స్ తో పాటు 22 షటర్స్ ను వ్యాపారులకు కేటాయించారు. ఈ సంధర్భంగా కమీషనర్ చాహేత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ, నగరపాలక సంస్థ ద్వారా సుచి శుభ్రతలో కూడిన ఆహార పదార్థాలు ప్రజలకు అందించాలనే సంకల్పంతో పద్మానగర్ సమీకృత మార్కెట్ ను నిర్మాణం చేశామన్నారు. మొత్తం 193 మంది వ్యాపారులు అమ్మకాలు చేస్కునేలా వేరు వేరుగా స్టాల్స్, షట్టర్లు నిర్మాణం చేసి... పలు రకాల సౌకర్యాలు కల్పించామని తెలిపారు. రిజర్వేషన్, జనరల్ కెటగిరి మరియు నగరపాలక సంస్థ కండీషన్స్ ప్రకారం లబ్ధిదారులకు స్టాల్స్, షట్టర్లను కేటాయించామని తెలిపారు. కేటాయించిన స్టాల్స్ ను పొందిన వ్యాపారులు 3 నెలల అడ్వాన్స్ ముందుగానే చెల్లించి 5 సంవత్సరాలకు అగ్రిమెంట్ చేస్కోవాలని అన్నారు. అగ్రిమెంట్ చేస్కోనియడల వారికి కేటాయించిన షాపును రద్దు చేసి వేరే వారికి కేటాయింపు చేయడం జరుగుతుందని తెలిపారు. మార్కెట్ ను 23 న ప్రారంభం చేసి ఆరోజే స్టాల్స్ పొందిన వ్యాపారులకు కేటాయింపు చేస్తామని తెలిపారు. షాపు పొందిన వారు ఇతరులకు లీజు లాంటి చర్యలకు పాల్పడితే అలాంటి వారి షాపును రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ లక్కి డ్రా ప్రక్రియ లో డిప్యూటీ కమీషనర్ స్వరూప రాణీ, ఆర్వో సునీల్, ఆర్ ఐ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపులను తొలగించాలి

### బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్



**ప్రజానావ, చిగురుమామిడి:** గ్రామాల్లో విచ్చలవిడిగా,పుట్టగొడుగుల పుట్టుకొస్తే బెల్ట్ షాపులను వెంటనే తొలగించాలని బిఎస్పి పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ తెలిపారు. సోమవారం చిగురుమామిడి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో బిఎస్పి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే రాష్ట్రంలో బెల్టు షాపులు ఉండవని సీఎం రేవంత్ రెడ్డి పలు బహిరంగ సభలలో మాట్లాడాలని బీఎస్పీ పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ తెలిపారు.వారి యొక్క మేనిఫెస్టోలో కూడా బెల్ట్ షాపులు ఉండకుండా చేస్తామని చెప్పి ఏడాది గడిచిన సీఎం రేవంత్ రెడ్డి వారి హామీ నిలబెట్టుకోలేదన్నారు.బెల్ట్ షాపుల విషయంలో జీవోలు తీయవలసిన అవసరం లేకున్నా ఒక్క మాట ఎక్సైజ్ శాఖకు చెబితే బంద్ అవుతాయన్నారు.ఓట్ల మీద ఉన్న ధ్యాస ప్రజల మీద మహిళల మీద లేదన్నారు.పేద మధ్యతరగతి కుటుంబాలు ప్రతి గ్రామంలో ఈ బెల్ట్ షాపుల వల్ల ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు.విపరీతంగా మద్యం సేవించడం వల్ల కాలేయ వ్యాధులు గుండె వ్యాధులు పక్షవాతంతో ఆసుపత్రులకు వెళ్లడం జరుగుతుందనీ రవీందర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు.చాలామంది మద్యానికి బానిసలు అయి చనిపోతున్నారనీ,చనిపోయిన కుటుంబాలలోని పిల్లలు విద్యకు దూరం కావడం జరుగుతుందన్నారు.పచ్చగా ఉండే పల్లెటూర్లలో బెల్ట్ షాపులు వాళ్ల కుటుంబాలలో చిచ్చు పెడుతున్నాయనీ,గత బిఆర్ఎస్ ప్రభుత్వం వలె కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఏడాది గడిచిన మాట నిలబెట్టుకోలేక పోవడం సిగ్గుచేటు అన్నారు.ప్రభుత్వానికి ఆదాయం కావాలని చూస్తుందే కానీ ప్రజల ఆరోగ్యం గురించి ఆరాటం లేదన్నారు.హుస్నాబాద్ నియోజకవర్గంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నడుస్తున్నాయని,చిగురుమామిడి మండలంలోని ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు ఉన్నాయన్నారు.పేద మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా కోలుకోవడానికి తక్షణమే బెల్ట్ షాపులు బందు అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలని బిఎస్పి పార్టీ పక్షాన కోరారు.లేనిపక్షంలో ఎక్సైజ్ స్టేషన్ ను మహిళలతో ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో బిఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ ,బిఎస్పి జిల్లా నాయకులు ఎలగందుల శంకర్, నియోజకవర్గ అధ్యక్షులు వేల్పుల రాజు,మండల ప్రధాన కార్యదర్శి మంద నాగరాజు,మండల కార్యదర్శి పంది పెల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతిశీల క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రగతిశీల వీరశైవ సేవా సమాజం వారి క్యాలెండర్ ఆవిష్కరణ ఆల్విన్ కాలనీ ఫేస్ 2 లో శనివారం సాయంత్రం ఘనంగా జరిగింది. మల్లికార్జున స్వామి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటేర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తనయుడు రామకృష్ణ గౌడ్ మరియు కాలనీ పెద్దల చేతుల మీదుగా ప్రెగ్నెన్సీ మహిళలకు పోషక ఆహారం మరియు పండ్లు అందజేశారు.. ఈ కార్యక్రమంలో మల్లికార్జున స్వామి మాట్లాడుతూ ప్రెగ్నెన్సీ మహిళలకు పౌష్టికాహారం అందించడం చాలా పుణ్యమని, ఒకేసారి రెండు జీవులకు ఆకలి తీర్చిన వారవుతారని, ఇటువంటి కార్యక్రమాలు చేస్తున్న ప్రగతిశీల వీరశైవ సేవా సమాజము అధ్యక్షులు మరియు కార్యవర్గాన్ని అభినందించారు. రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ ప్రెగ్నెన్సీ మహిళలకు పౌష్టికాహారం అందించడం చాలా మంచి విషయమని, ఇటువంటి సేవ కార్యక్రమాలు చేస్తున్న ప్రగతిశీల సమాజానికి అభినందిస్తూ, ఇటువంటి కార్యక్రమాలు మా చేతుల మీదుగా చేయడం మాకు చాలా సంతోషంగా ఉందని, ప్రతి ఏడాది మట్టి వినాయకుల పంపిణీ వంటి ఏదో ఒక రకంగా సమాజ సేవ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్న ప్రగతిశీల సమాజానికి తాము కూడా అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సమాజ పెద్దలు అడికే జగదీశ్వర్, కోట గుండప్ప, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నర్సిములు, శివ శరణప్ప, కోనపురం మల్లికార్జున్, విజయరామ్, అలీ బద్రన్న, రుద్ర కుమార్, ప్రధాన కార్యదర్శి వి.ఆర్ విజయ లింగం, ఉపాధ్యక్షులు జితేందర్, రేవని జగదీశ్వర్, ఆకాంక్ష వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సి.హెచ్ వి రామారావు, మంజుల మోనప్ప, సంధ్య రాణి , మీడియా ఇంచార్జ్ నవీన్ రామోజీ, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి సన్నిధానంలో భక్తుల,ఆలయ భద్రత నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా బాంబు,డాగ్ స్క్వాడ్ టీం సభ్యులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. వేములవాడ రాజన్న ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చిన నేపథ్యంలో బాంబు,డాగ్ స్క్వాడ్ టీం తనిఖీలు నిర్వహించారు.
- ప్రజానావ, వేములవాడ



వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి సన్నిధానంలో భక్తుల సౌకర్యార్థం పలు స్మార్ట్ టీవీలో తో పాటు భారీ ఫ్యాను ఏర్పాటు చేశారు. స్మార్ట్ టీవీలు(క్యూలైన్, లడ్డు కౌంటర్) ప్రాంతాల్లో భక్తిపార్వశాన్ని మరింత పెంపొందించే విధంగా ఆలయంలో జరిగే పూజ కార్యక్రమాలతో పాటు త్యాగరాజు ఆరాధన ఉత్సవాలను ప్రసారం చేస్తున్నారు. దీంతో రాజన్న భక్తులు స్మార్ట్ టీవీలో ప్రసారమవుతున్న భక్తి గీతాలు, పూజలను చూసి తన్మయత్వాన్ని పొందుతున్నారు.



## లఖ్‌నవూ సూపర్ జెయింట్స్
# కెప్టెన్‌గా రిషభ్ పంత్

ఐపీఎల్-20225 సీజన్ ముంగిట లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ నుంచి కీలక ప్రకటన వచ్చింది. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక ధర వెచ్చించి సొంతం చేసుకున్న రిషభ్ పంత్‌ను కెప్టెన్ నియమిస్తున్నట్లు ఫ్రాంఛైజీ తెలిపింది. పంత్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించినట్లు సోమవారం కోల్‌కతాలో జరిగిన ఓ కార్యక్రమంలో ఫ్రాంఛైజీ యజమాని సంజీవ్ గొయెంకా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పంత్ కూడా గొయెంకాతో కలిసి పాల్గొన్నాడు. గతేడాది నవంబర్‌లో జరిగిన మెగా వేలంలో పంత్‌ను లఖ్‌నవూ ఏకంగా రూ.27 కోట్లకు దక్కించుకున్న సంగతి తెలిసిందే. దిల్లీ సారథిగా బాధ్యతలు నిర్వర్తించిన అతడిని లఖ్‌నవూ కెప్టెన్సీని అప్పగించేందుకే అంత మొత్తం పెట్టిందని వార్తలొచ్చాయి. నికోలస్ పూరన్ కూడా కెప్టెన్సీ రేసులో ఉన్నట్లు ప్రచారం జరిగినా పంత్ వైపే యజమాన్యం మొగ్గుచూపింది. 'రిషభ్ పంత్ ఐపీఎల్‌లో అత్యంత విలువైన ఆటగాడు మాత్రమే కాదు అత్యుత్తమ ఆటగాడు. ప్రస్తుతం ఐపీఎల్‌లో మహేంద్రసింగ్ ధోనీ, రోహిత్ శర్మను విజయవంతమైన కెప్టెన్లు అని చెబుతారు. నా మాటలు గుర్తుంచుకోండి. 10-12 ఏళ్ల తర్వాత పంత్ కూడా వారి సరసన చేరుతాడు' అని సంజీవ్ గొయెంకా పేర్కొన్నారు.

## గిల్‌కు వైస్ 'కెప్టెన్సీ'
# భవిష్యత్తు కోసమే నిర్ణయం

### రవిచంద్రన్ అశ్విన్



ఛాంపియన్స్ ట్రోఫీ 2025 కోసం జట్టును ప్రకటించిన సమయంలో వైస్ కెప్టెన్సీపై తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. చివరికి రోహిత్ శర్మకు డిప్యూటీగా శుభ్‌మన్ గిల్‌ను నియమిస్తూ జట్టును వెల్లడించింది. దీంతో భవిష్యత్తులో వన్డే జట్టును నడిపించే అవకాశం తొలుత గిల్‌కే ఇస్తారన్న ప్రచారం మొదలైంది. గతేడాది జింబాబ్వేతో టీ20 సిరీస్‌కు గిల్ సారథ్యంలో భారత్ వెళ్లిన సంగతి తెలిసిందే. శ్రీలంకతో జరిగిన వన్డే, టీ20 సిరీస్‌లకూ వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. పేలవ ఫామ్‌తో జట్టులో స్థానంతోపాటు ఉప నాయకత్వమూ కోల్పోయాడు. ఇప్పుడు మళ్లీ గిల్‌కు వన్డేల్లో వైస్ కెప్టెన్సీ దక్కింది. ఎందుకు అతడికి ఆ బాధ్యతలు అప్పగించామనేది కూడా చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ వివరణ ఇచ్చాడు. ఈ క్రమంలో భారత మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ మేనేజ్‌మెంట్ నిర్ణయాన్ని అభినందించాడు. భవిష్యత్తును అంచనా వేసి గిల్‌కు అవకాశం ఇచ్చినట్లు విశ్లేషించాడు. "ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీకి ప్రకటించిన జట్టులో శుభ్‌మన్ గిల్‌కు కాకుండా.. ఇతర క్రికెటర్లలో ఎవరికి వైస్ కెప్టెన్సీ అప్పగించవచ్చునేది మీరు చెప్పండి? ఇక్కడ నేను గిల్‌కు ఇవ్వడం సరైందా? కాదా? అనేది మాట్లాడటం లేదు. గతంలో కొన్ని సిరీసుల్లోనూ అతడు ఉపనాయకుడిగా వ్యవహరించాడు. కాబట్టి, అతడికి ఇవ్వడం సరైనది అనే వాదనా ఉంది. టెస్టుల్లోనూ వైస్ కెప్టెన్సీ చేసినట్లు గుర్తు. భవిష్యత్తులో తమ నాయకుడు ఎవరు ఉండొచ్చనే అంశంపై మేనేజ్‌మెంట్ ఆలోచించి ఉండొచ్చు. అందుకే, ఇప్పుడీ నిర్ణయం తీసుకొని ఉంటుందని భావిస్తున్నా" అని అశ్విన్ పేర్కొన్నాడు. "శుభ్‌మన్ గిల్‌ను వైస్ కెప్టెన్‌గా ప్రకటించడంతో ఫైనల్‌లో అతడికి చోటు దక్కడం ఖాయమే. ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌కు సూర్యకు డిప్యూటీగా అక్షర్ పటేల్‌ను ఎంపిక చేసింది. ఛాంపియన్స్ ట్రోఫీ విషయాని కొచ్చేసరికి రవీంద్ర జడేజాతోపాటు అక్షర్ పటేల్ తుది జట్టులో స్థానం కోసం పోటీలో ఉన్నాడు. వీరిద్దరిలో ఒకరికే అవకాశం రావచ్చు. వికెట్ కీపర్లుగా రిషభ్ పంత్, కేఎల్ రాహుల్‌ను తీసుకుంది. కేఎల్ తాత్కాలికంగానే కీపింగ్ బాధ్యతలు చేపడుతున్నాడు. వీరిద్దరూ ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లు ఆడతారు. భవిష్యత్తులో శుభ్‌మన్ గిల్ కెప్టెన్ అయితే విరాట్, బుమ్రా నుంచి సూచనలు, సలహాలు తీసుకోవాలి. అప్పుడే నాయకుడిగా మరింత రాటుదేలేందుకు అవకాశం ఉంది" అని అశ్విన్ వెల్లడించాడు.



## కరుణ్ నాయర్‌ను స్టాండ్‌బైగా ఎంచుకోవాల్సింది : హర్భజన్ సింగ్

ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టును రెండు రోజుల కిందట బీసీసీఐ ప్రకటించింది. రోహిత్ శర్మ నాయకత్వంలోనే టీమ్‌ఇండియా బరిలోకి దిగనుంది. వైస్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్‌కు అవకాశం ఇచ్చింది. దేశవాళీలో అదరగొట్టిన కరుణ్ నాయర్‌పై మేనేజ్‌మెంట్ మొగ్గు చూపించలేదు. ఎనిమిది మ్యాచుల్లో ఐదు సెంచరీలతో 779 పరుగులు చేశాడు. వన్డే ఫార్మాట్‌లో దూకుడుగా ఆడిన అతడిని పక్కన పెట్టడంపై మాజీ క్రికెటర్లు అసంతృప్తి వ్యక్తంచేశారు. తాజాగా హర్భజన్ సింగ్ కూడా దీనిపై స్పందించాడు. 15 మంది స్క్వాడ్‌లో అవకాశం ఇవ్వకపోయినా.. కనీసం స్టాండ్‌బైగా తీసుకున్నా బాగుండేదని అభిప్రాయపడ్డాడు. "భారత జట్టును ఎంపిక చేయడమంటే సెలక్టర్లకు చాలా కష్టమే. అదీనూ 15 మందితో స్క్వాడ్ అంటే ఇంకా ఇబ్బందికరంగా ఉంటుంది. దేశవాళీలో అదరగొట్టిన వారికి స్థానం కల్పించకపోలేకపోయారు. ఎవరిని పక్కన పెట్టాలి? ఎవరిని తీసుకోవాలనేది నిర్ణయించడం కష్టమని నేనూ అంగీకరిస్తా. కరుణ్ నాయర్ వంటి ప్లేయర్ సరిగ్గా ఆడకపోతే ప్రశ్నించేవాడిని కాదు. కానీ, అతడు అద్భుతమైన ప్రదర్శన చేశాడు. కనీసం అలాంటి ప్లేయర్‌ను అదనంగా స్టాండ్ బై ఆటగాడిగానైనా తీసుకోవాల్సింది. ఇలా అయితే రంజీ మ్యాచ్‌ల ప్రాముఖ్యత ఏముంటుంది? అంతర్జాతీయ క్రికెటర్ ఎవరైనా ఫామ్‌లో లేకపోతే అతడిని తప్పించి.. దేశవాళీలో ఆడాలని చెప్పాలి. ఫామ్‌లోకి వస్తేనే మళ్లీ జట్టులోకి తీసుకుంటామని స్పష్టంచేయాలి. ఎవరైతే బాగా ఆడారో వారి ఆటను అస్సలు చూడటం లేదు. కరుణ్‌నాయర్‌ను స్టాండ్‌బైగా తీసుకుంటున్నట్లు ప్రకటించాలి. మళ్లీ జాతీయజట్టులోకి తీసుకువచ్చేందుకు ఇదే మంచి సమయం. కఠినమైన శ్రమకు సరైన గుర్తింపు ఉంటుందనే నమ్మకాన్ని కలిగించాల్సిన అవసరం ఉంది" అని భజ్జీ తెలిపాడు. కరుణ్ నాయర్‌ను ఎంపిక చేయకపోవడంపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ తనదైన శైలిలో విశ్లేషించాడు. "ఒకవేళ అతడిని జట్టులోకి తీసుకుంటే ఎక్కడ ఆడించాలి? ఇటీవల భారత్ ఎక్కువ వన్డేల్లోనూ ఆడలేదు. కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ ఇప్పటికే టీమ్‌లో ఉన్నారు. రెండో వికెట్ కీపర్‌గా కేఎల్ చాలా బాగా ఆడుతున్నాడు. వన్డేల్లో శ్రేయస్ కూడా మంచి ప్రదర్శనే ఇచ్చాడు. అందుకే, కరుణ్‌నాయర్‌కు ఛాన్స్ దక్కలేదు. ఇదే ఫామ్‌ను కొనసాగిస్తూ వెళ్తే మాత్రం ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు అతడిని పక్కనపెట్టడం సెలక్టర్లకు క్లిష్టమైన నిర్ణయమవుతుంది" అని గావస్కర్ వెల్లడించాడు.

## భారత్‌దే ఖోఖో ప్రపంచకప్



మొట్టమొదటి ఖోఖో ప్రపంచకప్‌లో భారత్ ఆధిపత్యాన్ని చాటుకుంది. అదిరే ఆటతో పురుషులు, మహిళల విభాగాల్లో విజేతగా నిలిచింది. ఆదివారం మహిళల ఫైనల్లో భారత్ 78-40తో నేపాల్‌ను చిత్తు చేసింది. ఆరంభం నుంచే మన జట్టు దూకుడుగా ఆడింది. కెప్టెన్ ప్రియాంక ఇంగ్లే, వైష్ణవి రాణించడంతో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆఖరిదాకా అదే జోరు ప్రదర్శించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. పురుషుల తుదిపోరులో భారత్ 54-36తో నేపాల్‌పై విజయం సాధించింది. ఆరంభంలోనే ఎటాకింగ్ గేమ్ ఆడిన భారత్ 26-0తో ఆధిక్యంలో నిలిచింది. కానీ తర్వాత నేపాల్ ప్రతిఘటించింది. అయితే దూకుడు కొనసాగించిన భారత్ విజయాన్ని సొంతం చేసుకుంది. ఖోఖో ప్రపంచకప్ కైవసం చేసుకున్న భారత జట్లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. ఈ విజయం యువతరానికి స్ఫూర్తినిస్తుందని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

# రోహిత్.. నువ్వు సూపర్

### నెట్టింట ప్రశంసలు

వాంఖడే మైదానం 50 ఏళ్ల సంబరాలు ఘనంగా జరిగాయి. క్రికెట్ దిగ్గజాలు సునీల్ గావస్కర్, సచిన్ తెందూల్కర్, రవిశాస్త్రి, దయానా ఎడుల్జీ తదితరులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 50వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేశారు. సునీల్ గావస్కర్ డ్యాన్స్ చేసి అలరించాడు. భారత కెప్టెన్ రోహిత్ శర్మ కూడా హాజరయ్యాడు. అతడూ ముంబయి జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో సీనియర్ క్రికెటర్‌పై రోహిత్ వ్యవహరించిన తీరు అభిమానులను ఆకట్టుకుంది. 'రోహిత్.. నువ్వు సూపర్' అంటూ కామెంట్లు చేశారు. ఇంతకీ జరిగిందేంటంటే? వారం రోజుల నుంచి ముంబయిలోని వాంఖడే మైదానం వార్షికోత్సవాలు జరుగుతున్నాయి. ఆదివారం ఆ సంబరాలకు ముగింపు పలుకుతూ ఎంసీఏ ఘనంగా కార్యక్రమాలు నిర్వహించింది. సభా వేదికపై మాజీ క్రికెటర్లు ఆశీనులయ్యారు. వారి కోసం స్టేజ్‌పై కుర్చీలను కాస్త దూరంగా మూడువైపులా వేశారు. రోహిత్ శర్మ వేదిక వద్దకు వచ్చేటప్పటికే గావస్కర్, సచిన్, ఎడుల్జీ, రవిశాస్త్రి కూర్చొని ఉన్నారు. కానీ, రవిశాస్త్రి తన పక్కన ఉన్న సీటును చూపిస్తూ అందులోకి రావాలని సూచించాడు. అప్పటికే సభ మధ్యలో ఓ రెండు కుర్చీలు ఖాళీగా ఉండటంతో.. అక్కడ కూర్చోవాలని రవిశాస్త్రిని రోహిత్ కోరాడు. మాజీ క్రికెటర్‌ను మధ్యలో కూర్చోబెట్టి ఆ పక్కనే రోహిత్ ఆశీనులయ్యాడు. ఇప్పుడీ



వీడియోను సోషల్ మీడియాలో ఓ అభిమాని షేర్ చేయడంతో అది వైరల్‌గా మారింది.

**మళ్లీ సంబరాలు చేసుకుందాం: రోహిత్**

టీ20 ప్రపంచకప్‌ను భారత్ నెగ్గిన తర్వాత వాంఖడే మైదానంలో భారీఎత్తున సంబరాలు చేసుకున్న సంగతి తెలిసిందే. మరోసారి 140 కోట్ల మంది ఆశలను దుబాయ్‌కు తీసుకెళ్తోన్నట్లు టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ వెల్లడించాడు. "దుబాయ్‌లో జట్టు వెనక 140 కోట్ల మంది మద్దతు ఉంటుంది. మావంతు తీవ్రంగా శ్రమించి విజేతగా నిలిచేందుకు ప్రయత్నిస్తాం. మళ్లీ వాంఖడేకు ఛాంపియన్స్ ట్రోఫీని తీసుకొస్తాం" అని వ్యాఖ్యానించాడు. ఫిబ్రవరి 19 నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ జరగనుంది. చివరిసారిగా భారత్ 2013లో ధోనీ సారథ్యంలో టైటిల్‌ను సాధించింది. వన్డే కెరీర్‌లో చివరి ఐసీసీ ట్రోఫీగా భావిస్తోన్న రోహిత్ ఘనమైన వీడ్కోలు పలకాలనే ఉద్దేశంలో ఉన్నాడు.

## చివరి వారం వరకూ కేకేఆర్ నుంచి
# సరైన సమాచారం లేదు



**- శ్రేయస్ అయ్యర్**

ఐపీఎల్ మెగా వేలంలో రూ. 26.75 కోట్లను శ్రేయస్ అయ్యర్ దక్కించుకున్నాడు. పంజాబ్ కింగ్స్ అతడిని తీసుకుంది. రిషభ్ పంత్ (రూ. 27 కోట్లె) తర్వాత అత్యధిక మొత్తం సొంతం చేసుకున్న క్రికెటర్‌గా నిలిచాడు. ఐపీఎల్ 2024 సీజన్ విజేతగా నిలిచిన కేకేఆర్‌కు సారథిగా శ్రేయస్ ఉన్న సంగతి తెలిసిందే. కానీ, రిటెన్షన్‌లో మాత్రం అతడిని కోల్‌కతా మేనేజ్‌మెంట్ పక్కన పెట్టింది. దీంతో మెగా వేలంలోకి వచ్చేసి భారీ మొత్తం దక్కించుకున్నాడు. ఐపీఎల్‌లో కప్ అందించిన కెప్టెన్‌ను ఎవరూ వదులుకోరు. కానీ, కేకేఆర్ వదిలేయడంపై తాజాగా ఓ ఇంటర్వ్యూలో శ్రేయస్ స్పందించాడు. చివరి వరకూ సరైన సమాచారం ఇవ్వడంలో కేకేఆర్ విఫలమైందని వ్యాఖ్యానించాడు. "కోల్‌కతా తరఫున విజేతగా నిలవడం అద్భుతంగా అనిపించింది. కేకేఆర్‌కు అభిమానుల మద్దతు చాలా బాగుంటుంది. ప్రతి మ్యాచ్‌కు స్టేడియం మొత్తం నిండిపోయేది. అక్కడ గడిపిన ప్రతి క్షణం ఆస్వాదించా. ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిచిన తర్వాత చాలాసార్లు మాట్లాడుకున్నాం. కానీ, ఎప్పుడూ రిటెన్షన్ అంశం చర్చకు రాలేదు. అసలు ఏం జరుగుతుందో తెలియక అయోమయానికి గురయ్యా. సరైన సమాచారం లేకపోవడం వల్లే ఇదంతా జరిగింది. చివరికి విడిపోయే వరకూ వచ్చింది. అయితే ఇది పరస్పర అంగీకారంతోనే జరిగిందని బలంగా నమ్ముతా. కమ్యూనికేషన్ సరిగ్గా లేకపోవడం నన్ను తీవ్రంగా బాధించింది. రిటెన్షన్‌కు వారం రోజుల ముందే విషయాలు తెలిశాయి. దీంతో నేను నా నిర్ణయం తీసుకున్నా. ఆ తర్వాత ఏం జరిగినా ఫర్వాలేదని ముందడుగు వేశా" అని అయ్యర్ తెలిపాడు. "మెగా వేలం జరుగుతున్నప్పుడు నేను హైదరాబాద్‌లో జట్టుతోపాటు ఉన్నా. మంచి ధర వస్తుందని భావించా. కానీ, ఇంత భారీ మొత్తంతో సొంతం చేసుకుంటారని అస్సలు ఊహించలేదు. రెండు జట్లు నా కోసం తీవ్రంగా వేలంలో పాల్గొన్నాయి. ఇది నాకెంతో థ్రిల్లింగ్‌గా అనిపించింది. కాసేపటికి రూమ్ డోర్ మూసేసి.. వాష్‌రూమ్‌కు వెళ్లిపోయా. బయట ఏం మాట్లాడుకుంటున్నారనేది వినకూడదనే అలా చేశా" అని వ్యాఖ్యానించాడు.

## నా పేరు వచ్చేసరికి.. ఫ్రాంచైజీల వద్ద
# సొమ్ము లేదేమో!

**ఉమేశ్ యాదవ్**




భారత జట్టు సీనియర్ పేసర్ ఉమేశ్ యాదవ్‌కు ఐపీఎల్ మెగా వేలం నిరాశ కలిగించింది. కనీసం ఒక్క ఫ్రాంఛైజీ కూడా అతడిని కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపించలేదు. రిషభ్ పంత్‌ను రూ.27 కోట్లు వెచ్చించి మరీ లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఐపీఎల్‌లో దాదాపు 150 వికెట్లు తీసిన వెటరన్ ప్లేయర్‌ను తీసుకోకపోవడం క్రికెట్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. ఇప్పటివరకు దిల్లీ, బెంగళూరు, కోల్‌కతా, గుజరాత్ జట్లకు ఆడిన అతడు ఈసారి మాత్రం అన్‌సోల్డ్‌గా మిగిలిపోయాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఇదే అంశంపై ఉమేశ్ స్పందించాడు. ఈ నిర్ణయం తనను తీవ్రంగా కలిచివేసిందని.. షాక్‌కు గురైనట్లు వెల్లడించాడు. అయితే, తన పేరు వచ్చేటప్పటికి ఫ్రాంచైజీల దగ్గర తగినంత సొమ్ము లేకపోవడం వల్ల కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపించలేదేమోనని ఈ 37 ఏళ్ల పేసర్ వ్యాఖ్యానించాడు. "ఐపీఎల్ 2025 సీజన్‌కు నేను ఎంపిక కాలేదని ప్రతిఒక్కరికీ తెలుసు. ఈ మెగా టోర్నీలో దాదాపు 15 ఏళ్ల పాటు ఆడా. ఇప్పుడు అన్‌సోల్డ్‌గా మిగిలిపోయా. ఇది నన్ను తీవ్ర షాక్‌కు గురిచేసింది. ఈ విషయంలో నాకు చాలా బాధ కలిగించిందని చెబుతా. దాదాపు 150 మ్యాచుల్లో ఆడిన తర్వాత సెలక్ట్ కాకపోతే పరిస్థితి చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. అయితే, ఇది ఫ్రాంచైజీ స్ట్రాటజీ అయ్యుండొచ్చు లేదా మెగావేలంలో నా పేరు కాస్త ఆలస్యంగా రావడంతో ఇలా జరిగిందేమోనని అనుకుంటున్నా. అప్పటికి ఫ్రాంచైజీల వద్ద తగినంత సొమ్ము లేదు. ఏదేమైనా అది జరిగిపోయింది. నేను మాత్రం తీవ్ర నిరాశకు గురయ్యా. ఇతరుల నిర్ణయాన్ని నేను మార్చలేను" అని ఉమేశ్ తెలిపాడు. 'నా రిటైర్మెంట్‌పై వార్తలు వస్తున్నాయి. ఆ నిర్ణయం తీసుకోవడానికి సమయం ఉంది. నా కాలికి సర్జరీ తర్వాత పూర్తిగా కోలుకున్నా. ఇప్పటికీ 140 కి.మీ.ల వేగంతో బంతిని విసరగలను. బౌలింగ్ చేయగలను. ఎప్పుడైతే అలా చేయలేనని భావిస్తానో.. క్రికెట్‌కు వీడ్కోలు పలికేస్తా. ఈ విషయం ఎవరికీ చెప్పను" అని ఉమేశ్ యాదవ్ వెల్లడించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఈ సీనియర్ బౌలర్ 57 టెస్టులు, 75 వన్డేలు, 9 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. మూడు ఫార్మాట్లలో కలిపి మొత్తం 280కిపైగా వికెట్లు పడగొట్టాడు. రెండేళ్ల కిందట ఆసీస్‌తో జరిగిన ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో భారత్ తరఫున చివరిసారిగా ఉమేశ్ ఆడాడు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



## అందుకు బాధగా ఉంది : కంగనా రనౌత్

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితాన్ని ఆధారంగా చేసుకుని బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'ఎమర్జెన్సీ'. సెన్సార్ విషయంలో పలు ఇబ్బందులు ఎదుర్కొన్న ఈ చిత్రం ఎట్టకేలకు జనవరి 17న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కంగన యాక్టింగ్‌ను పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు మెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలోనే కంగన తాజాగా ఓ వీడియో రిలీజ్ చేశారు. తన చిత్రాన్ని ఆదరిస్తున్న వారికి ధన్యవాదాలు చెప్పారు. "నా తరఫున, జీ స్టూడియోస్ తరఫున మా చిత్రాన్ని ఆదరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. మా చిత్రంపై మీరు ఎంతో ప్రేమను కనబరుస్తున్నారు. మీ ఆదరణ చూసి మాకు మాటలు రావడం లేదు. అయితే, పంజాబ్‌లో మా సినిమాపై నిషేధం విధించడం నన్ను ఒకింత బాధకు గురి చేసింది. ఒకానొక సమయంలో నా చిత్రాలు ఆ రాష్ట్రంలో బాగా ఆడేవి. కానీ, ఇప్పుడు నా సినిమా అక్కడ విడుదల కూడా కాలేదు. బ్రిటన్, కెనడాలో ఉంటున్న కొంతమంది ఆ రాష్ట్ర వాసులు ఈ చిత్రంపై వ్యతిరేకత చూపిస్తున్నారని నా దృష్టికి వచ్చింది. సినిమా చూడాలని ఆసక్తి చూపించే వారిపైనా దాడి చేస్తున్నారని తెలిసింది. కొంతమంది వ్యక్తుల కారణంగా ఈ రకమైన విద్వేషాలు ఏర్పడుతున్నాయి. నాలోని దేశభక్తికి నిదర్శనంగా దీనిని రూపొందించా. ఇది మనల్ని ఏకం చేస్తుందా? లేదా? అనే విషయాన్ని సినిమా చూసి మీరే తెలుసుకోండి" అని కంగన చెప్పారు. ఇందిరా గాంధీగా కంగనా నటించగా.. జయప్రకాశ్ నారాయణ్ పాత్రలో అనుపమ్ ఖేర్, అటల్ బిహారీ వాజ్‌పేయిగా శ్రేయాస్ తల్పడే నటించారు. సెన్సార్ బోర్డు చాలారోజుల పాటు క్లియరెన్స్ ఇవ్వలేదు. కోర్టు జోక్యంతో సర్టిఫికేట్ ఇచ్చేందుకు సెన్సార్ ఆమోదం తెలిపింది. సెన్సార్ సూచన మేరకు చిత్రబృందం కొన్ని సన్నివేశాలు కూడా తొలగించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ పంజాబ్‌లో ఈసినిమాపై నిషేధం విధించారు.



## చిక్కుల్లో 'కాంతార చాప్టర్ 1'

కన్నడ నటుడు రిషభ్ శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం 'కాంతార చాప్టర్ 1'. 2022లో విడుదలై విజయాన్ని అందుకున్న 'కాంతార'కు ఇది ప్రీక్వెల్‌గా తెరెక్కుతోన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూట్ కర్ణాటకలోని గవి గుడ్డ, హేరూరు అటవీ ప్రాంతాల్లో జరుగుతోంది. ఇదిలాఉండగా, తాజాగా చిత్రబృందం చిక్కుల్లో పడింది. ఈ సినిమా చిత్రీకరణ కారణంగా అటవీ ప్రాంతం నాశనం అవుతోందని పేర్కొంటూ అక్కడి స్థానికులు పోలీసులను ఆశ్రయించారు. గ్రామ శివార్లలోని ఖాళీ మైదానాల్లో షూట్ చేసుకోవడానికి అధికారులు అనుమతి ఇచ్చినప్పటికీ చిత్రబృందం మాత్రం అక్రమంగా అటవీ ప్రాంతంలో షూట్ చేస్తుందని, అంతేకాకుండా పేలుడు పదార్థాలు కూడా ఉపయోగిస్తుందని స్థానికులు ఆరోపణలు చేశారు. దీనివల్ల అటవీ ప్రాంతంలో ఉండే మూగ జీవాలకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని తెలిపారు. ఈవిషయమై స్థానికులు చిత్రబృందాన్ని సంప్రదించగా.. ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన ఓ యువకుడిపై చిత్రబృందం దాడి చేసిందని పేర్కొంటూ స్థానికులంతా పోలీసులను ఆశ్రయించారు. ఈమేరకు యెసలూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. పోలీసులు దీనిపై త్వరితగతిన స్పందించి, చర్యలు తీసుకోకపోతే తాము హైకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తామని స్థానికులు తెలిపారు. రిషభ్ స్వీయ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. 'కాంతార'కు ప్రీక్వెల్‌గా 'కాంతార: చాప్టర్ 1' రానుండడంతో దీనిపై అంచనాలు ఏర్పడ్డాయి. పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్‌గా ఇది సిద్ధమవుతోంది. హొంబలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కిరంగదూర్ దీనిని నిర్మిస్తున్నారు. జయరామ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. కదంబుల కాలంలో సాగే ఆసక్తికర కథాంశంతో ఇది ఉండనుంది. దీనికోసం కలరిపయట్టు యుద్ధ విద్యలో గత కొన్నాళ్లుగా రిషభ్ శెట్టి కఠిన శిక్షణ తీసుకుంటున్నారు. ఈ ఏడాది అక్టోబర్ 2న దీనిని విడుదల చేయాలనుకుంటున్నామని ఇప్పటికే టీమ్ ప్రకటించింది.




## భారీ అంచనాలు పెంచుతున్న తండేల్

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య -సాయిపల్లవి కాంబోలో సినిమా వస్తుందంటే క్రేజ్ ఎలా ఉంటుందో తెలిసిందే. ఇప్పటికే లవ్ స్టోరీతో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఈ స్టార్ యాక్టర్లు ప్రస్తుతం తండేల్‌లో నటిస్తున్నారు. రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రం చందూ మొండేటి డైరెక్షన్‌లో తెరకెక్కుతోంది. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ఈ మూవీ తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. అయితే తాజాగా మరో క్రేజీ నిర్ణయాన్ని తీసుకున్నారన్న వార్త ఒకటి నెట్టింట హల్ చల్ చేస్తోంది. తండేల్ మలయాళం వెర్షన్‌ను రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తుండగా.. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన కూడా ఉండబోతుందట. సాయిపల్లవికి మలయాళంలో సూపర్ క్రేజ్ ఉంటుందని తెలిసిందే. ఒకవేళ ఇదే నిజమైతే తండేల్ సినిమాకు మాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద వసూళ్లు పెరుగుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. తండేల్ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన బుజ్జి తల్లి సాంగ్‌కు మంచి స్పందన వస్తోంది. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా వస్తోన్న తండేల్ చిత్రాన్ని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. ఈ మూవీకి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తండేల్ నాగచైతన్య–చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడంతో ఈ ప్రాజెక్టుపై అంచనాలు భారీగానే ఉన్నాయి.




## అఖండ 2'.. ఎన్టీఆర్ జిల్లాలో లొకేషన్స్ పరిశీలించిన బోయపాటి

బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను తెరకెక్కిస్తోన్న చిత్రం 'అఖండ 2 తాండవం'. చిత్రానికి సంబంధించిన కొన్ని సన్నివేశాలను గుడిమెట్ల కొండలు, కృష్ణానది ప్రాంతంలో చిత్రీకరించాలని బోయపాటి భావిస్తున్నారు. ఇందులోభాగంగానే తాజాగా ఆయన ఎన్టీఆర్ జిల్లా నందిగామలో పర్యటించి అక్కడి లొకేషన్స్ చూశారు. నందిగామ నియోజకవర్గం చందర్లపాడు మండలం గుడిమెట్ల గ్రామం వద్ద కృష్ణానదీ తీర ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. షూట్‌కు ఈ ప్రాంతం అనువుగా ఉంటుందా? లేదా? అనే విషయం, ఆ లొకేషన్స్‌కు సంబంధించిన విషయాల గురించి స్థానికులతోనూ మాట్లాడారు. 2021లో విడుదలైన 'అఖండ'కు కొనసాగింపుగా 'అఖండ 2: తాండవం' సిద్ధమవుతోంది. ఇటీవల ఈ సినిమా షూట్ ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగింది. మహా కుంభమేళాలో కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఎం.తేజస్విని నందమూరి సమర్పకురాలు. సంచలన విజయం సాధించిన 'అఖండ'కి దీటుగా, భారీ హంగులతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. యాక్షన్, బలమైన డ్రామా మేళవింపుగా చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. అంచనాలకి తగ్గట్టుగానే సినిమా ఉంటుందని టాక్. దసరా సందర్భంగా సెప్టెంబరు 25న ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. తమన్ స్వరాలు అందిస్తున్నారు.



## పరమశివుడిగా అక్షయ్‌కుమార్..

### 'కన్నప్ప' నుంచి కొత్త పోస్టర్ రిలీజ్




నటుడు మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతోన్న చిత్రం 'కన్నప్ప'. 'మహాభారత' సిరీస్‌ని తెరకెక్కించిన ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వంలో ఇది సిద్ధమవుతోంది. ప్రీతి ముకుందన్ కథనాయికగా నటిస్తున్నారు. ఇందులో ఎంతో కీలకమైన పరమశివుడి పాత్రలో బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ నటిస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఆయన లుక్‌ను పరిచయం చేస్తూ చిత్రబృందం కొత్త పోస్టర్ షేర్ చేసింది. మహాదేవ్ పాత్రలో యాక్ట్ చేయడంపై అక్షయ్ ఆనందం వ్యక్తంచేశారు. ఇది తనకెంతో ప్రత్యేకమన్నారు. భారీ బడ్జెట్, అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానంతో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మొదట ఈ చిత్రాన్ని ప్రకటించినప్పుడు ప్రభాస్–నయనతారలు శివపార్వతులుగా కనిపించనున్నారని టాక్ వినిపించింది. అయితే కాజల్ పార్వతీదేవిగా కనిపిస్తున్నారని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రంలో శివుడిగా బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్‌కుమార్ నటించారు. ఇక ఇందులో ప్రభాస్ నంది పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. మోహన్‌లాల్, శివరాజ్ కుమార్, ఆర్.శరత్‌కుమార్, బ్రహ్మానందం తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. స్టీఫెన్ దేవస్సే, మణిశర్మ సంగీతం అందిస్తున్నారు. 'కన్నప్ప' చిత్రం అత్యధిక భాగాన్ని న్యూజిలాండ్‌లో చిత్రీకరించారు. అక్కడే ఈ సినిమా షూట్ చేయడానికి గల కారణాన్ని చెన్నైలో జరిగిన ప్రెస్‌మీట్‌లో చిత్రబృందం తెలియజేసింది. "ఈ చిత్ర కథ మూడో శతాబ్ద కాలం నాటిది. ఆనాటి ప్రకృతి రమణీయతను చిత్రంలో చూపించాల్సి ఉండడంతో న్యూజిలాండ్‌లో చిత్రీకరణ చేపట్టాం" అని చెప్పింది. ఏప్రిల్ 25న ఇది ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## బిగ్‌బాస్ షోకు గుడ్‌బై చెప్పిన కన్నడ హీరో




హాలీవుడ్ షో బిగ్ బ్రదర్‌కి మాతృకగా వచ్చిన బుల్లితెర రియాలిటీ షో బిగ్ బాస్‌కి ఇండియా అంతటా ఫ్యాన్స్ ఉన్న సంగతి తెలిసిందే. తెలుగు, హిందీలోనే కాకుండా తమిళం, కన్నడలోను ఈ షో టాప్ రియాలిటీ షోలలో ఒకటిగా నిలిచింది. అయితే కన్నడ బిగ్ బాస్ షోకి సంబంధించి హోస్ట్‌గా చేస్తున్న స్టార్ హీరో కిచ్చా సుదీప్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. ఈ షోకి తాను ఇకపై హోస్ట్‌గా చేయనని వెల్లడించాడు. ఈ సందర్భంగా ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు. కన్నడలో బిగ్‌బాస్ షో స్టార్ట్ అయినప్పటి నుంచి హోస్ట్‌గా కిచ్చా సుదీప్ ఉన్నాడు. 2013లో ఈ షో స్టార్ట్ అవ్వగా.. ఇప్పటివరకు 11 సీజన్‌లు విజయవంతంగా కంప్లీట్ చేసుకుంది. ఇందులో 11 సీజన్‌లకు సుదీప్ హోస్ట్‌గా వ్యవహరించి ప్రేక్షకులను అలరించాడు. అయితే ఈ స్టార్ నటుడు తాజాగా కన్నడ బిగ్ బాస్‌కి దూరమవుతున్నట్లు ప్రకటించాడు. "గత 11 సీజన్ల నుంచి నేను ఇష్టంతో పాటు ఎంజాయ్ చేసిన కార్యక్రమం బిగ్‌బాస్. ఈ షోకి హోస్ట్‌గా చేసిన నాపై మీరు చూపించిన ప్రేమకి ధన్యవాదాలు. త్వరలో జరుగనున్న ఫినాలేతో బిగ్ బాస్‌తో నా ప్రయాణం ముగుస్తుంది. వ్యాఖ్యతగా నా శక్తి మేరకు మీ అందరినీ ఎంటర్‌టైన్ చేశానని ఆశిస్తున్నాను. ఇది మరపురాని ప్రయాణం, నాకు సాధ్యమైనంతవరకూ ఉన్నతంగా దీనిని కొనసాగించా. నాకు ఈ అవకాశాన్ని ఇచ్చిన కలర్స్ కన్నడ టీవీకి వారికి ధన్యవాదాలు. ప్రేమతో మీ కే" అంటూ రాసుకొచ్చాడు సుదీప్.

## షూటింగ్‌లో ప్రమాదం.. హీరో, నిర్మాతకు గాయాలు

బాలీవుడ్ హీరో అర్జున్ కపూర్, నిర్మాత జాకీ భగ్నానీకి గాయాలయ్యాయి. 'మేరే హస్బెండ్‌కి బీవీ' సినిమా సెట్‌లో జరిగిన ప్రమాదంలో వీరిద్దరూ గాయపడ్డారు. జనవరి 18న ప్రమాదం జరిగినట్లు చిత్రబృందం తాజాగా తెలిపింది. అదృష్టవశాత్తూ సెట్‌లో ఎవరికీ తీవ్ర గాయాలు కాలేదని ప్రకటించింది. సెట్‌లో సీలింగ్ కూలిపోవడంతో ప్రమాదం జరిగినట్లు మూవీ యూనిట్ తెలిపింది. ఈ ప్రమాదంపై ఫెడరేషన్ ఆఫ్ వెస్టన్ ఇండియా సినీ ఎంప్లాయిస్ అధ్యక్షుడు తివారీ స్పందిస్తూ ప్రాణనష్టం జరగలేదని వెల్లడించారు. "షూటింగ్ జరుగుతున్న సమయంలోనే ప్రమాదం జరిగింది. సీలింగ్ కూలడంతో కొందరికి గాయాలయ్యాయి. వారిలో హీరో అర్జున్‌కపూర్, నిర్మాత జాకీ భగ్నానీ కూడా ఉన్నారు. నిర్వహణ లోపం కారణంగా ఈ ప్రమాదం జరిగింది. భద్రతా కారణాల దృష్ట్యా ఆ ప్రదేశంలో షూటింగ్‌ను నిలిపివేశాం" అని చెప్పారు. ఈ ప్రమాద ఘటనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు కూడా తెలిపారు. ఇక షూటింగ్ నిర్వహిస్తోన్న పురాతన భవనంలో భద్రత విషయాన్ని సరిగా పరిశీలించని ప్రొడక్షన్ డిపార్ట్‌మెంట్‌ను కూడా సంజాయిషీ లేఖ అడిగినట్లు తివారీ వెల్లడించారు. ఈ ప్రమాదంలో అర్జున్ కపూర్, జాకీ భగ్నానీకి స్వల్పగాయలు అయినట్లు తెలుస్తోంది. ఈ ఘటన తర్వాత సైఫ్ అలీఖాన్‌ను పరామర్శించడం కోసం అర్జున్ కపూర్ ఆసుపత్రికి వచ్చారు.



## నా భార్యకు నా పాస్‌వర్డ్‌లు అన్నీ తెలుసు : వెంకటేష్



టాలీవుడ్‌లో సక్సెస్ రేట్ ఎక్కువగా ఉన్న సీనియర్ హీరోల్లో టాప్‌లో ఉంటాడు వెంకటేశ్. తనదైన మ్యానరిజంతో వినోదాన్ని పంచే వెంకీ ఇటీవలే సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో తెరకెక్కిన ఈ మూవీలో ఐశ్వర్యా రాజేశ్, మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించాడు. భార్య, మాజీ ప్రియురాలి మధ్య చిక్కుకున్న భర్త పాత్రలో నటించాడు వెంకటేశ్. ఇందులో వెంకీ చెప్పే డైలాగ్స్ చాలా మంది ఫ్యామిలీ ఆడియెన్స్‌కు బాగా కనెక్ట్ అవుతున్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెంకటేశ్‌ను ఆసక్తికర ప్రశ్న అడిగింది యాంకర్ సుమ. మీ భార్యకు మీ మొబైల్ పాస్‌వర్డ్‌లు, ఇతర పాస్‌వర్డ్‌లు తెలుసా..? అని వెంకీని అడిగింది సుమ. దీనికి వెంకీ ఏ మాత్రం తడబడకుండా నా భార్యకు నా మొబైల్‌తోపాటు అన్ని ఖాతాలో పాస్‌వర్డ్‌లు తెలుసు. ఈ విషయంలో నేను చాలా పారదర్శకంగా ఉంటా. ఆమెకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చేశానంటూ చెప్పుకొచ్చాడు. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం సంక్రాంతి బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. కేవలం 6 రోజుల్లోనే రూ.100 కోట్ల షేర్‌ను రాబట్టి వెంకీ కెరీర్‌లో నయా బెంచ్ మార్క్ క్రియేట్ చేసింది. అనిల్ రావిపూడి కెరీర్ మైల్ స్టోన్ సినిమాగా నిలవడమే కాకుండా.. కెరీర్‌లో సెకండ్ హయ్యెస్ట్ గ్రాసింగ్ ఫిల్మ్‌గా నిలిచింది. ఈ చిత్రంలో నరేశ్, పాపులర్ మరాఠీ యాక్టర్, యానిమల్ ఫేం ఉపేంద్ర లిమాయే, కోలీవుడ్ నటుడు వీటీవీ గణేశ్ కీలక పాత్రలు పోషించారు. ఈ మూవీని దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించారు.

Printed, Published and Owned by **Adula Thirupathi,** Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO : **TELTEL/2023/87657**